మే - 2022

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


గౌరవ సంపాదకులు :

**డా॥ కె. సామ్యేల్ రాజేంద్ర**

సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**


**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 250/-
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-


**చిరునామా :**


ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9866716506


**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**


A/c Name: **K. Samuel Rajendra**
A/c No.: **10957294362**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్నత్వనేహు | కొడవటికంటి | 03 |
| నీ చింత దేనికొరకు | | 07 |
| దేవుడు - సిరి | | 09 |
| అబీగయీలు | | 10 |
| నేను నీతో చెప్పలేదా | | 12 |
| విడువని దేవుడు | | 13 |
| సాక్ష్యము | అబ్రాహాము కలపాల | 14 |
| విశ్వాసము | | 16 |
| నాకే ఎందుకిలా? | | 17 |
| ప్రత్యేకత | చిన్నపిల్లల కథ | 18 |
| సాక్ష్యము | శ్రీవిద్య | 20 |
| లోకంతీరు | | |
| | ఇమ్మానియేలు రాజేంద్ర | 22 |

# సంపాదకీయం.....



హన్నాకృప పాఠకులకు వ్యవస్థాపకుడు కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర నమస్కారములు.

గత 19 సంవత్సరాలుగా 'హన్నాకృప'ను ఆదరించి, బలపరచి, పత్రికను నడిపించడానికి ఆర్ధికముగా ఆదుకున్న ప్రతిఒక్కరికీ ప్రభువు నామమున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నా రెండవకుమారుడైన ఇమ్మానుయేల్ రాజేంద్ర 1999వ సం॥లో స్థాపించి, నడిపించుచున్న 'నిత్యజీవజలము' అను ఆధ్యాత్మిక మాస పత్రికను, గవర్నమెంట్ రిజిస్ట్రేషన్ కొరకు 2003 సం॥లో పేరు మార్చి 'హన్నాకృప'గా కొనసాగించినాము.

హన్నాకృప పత్రిక నాకు అనేక కుటుంబములను ఏర్పరచింది. పత్రిక ద్వారా ప్రభువు ఎన్నో అద్భుతాలు జరిగించినాడు. దానికి పాఠకులే సాక్షులు. 2020 లో నాకు బి.పి. వలన ఆరోగ్యం సరిలేక దేవుని మీద ఆధారపడకుండా, అప్పుల మీద ఆధారపడినందున దైవచిత్తము నెరవేర్చలేకపోయాను. ఇప్పుడు ఆరోగ్యము పూర్తిగా బాగుపడక పోయినను దేవుడిచ్చిన విశ్వాసముతో, చేసిన పొరపాట్లను సరిదిద్దుకొని మీ ముందుకు వస్తున్నాను.

ఇప్పుడు నా వయస్సు 83సం॥లు. వయస్సు రిత్యా హన్నాకృప పత్రిక పునాదియైన నిత్యజీవజలమును స్థాపించిన నా రెండవ కుమారుడైన ఇమ్మానుయేల్ రాజేంద్ర బి.ఏ., బి.యల్.కు హన్నాకృప పత్రిక యొక్కపూర్తి బాధ్యతలను అప్పగించుచున్నాను. ఇకపై మీ ఉత్తర ప్రత్యుత్తరములు, ప్రార్థన విన్నపములు, సలహాలు, సూచనలు తెలియపరచి నన్ను ఆదరించినట్లే నా కుమారున్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఎప్పటివలెనే పత్రికకు ప్రధాన సంపాదకులు యేసుప్రభువు అని గమనించి, పత్రిక కొరకు ప్రార్థించి, ఆదరించి నడిపిస్తారని ఆశిస్తున్నాను. ఇక మీదట పత్రిక సవ్యముగా నడిపించబడుతుందని, ఈ 2 సం॥లలో మీరు పడిన ఇబ్బందులు మన్నించి పత్రికకు కావలసిన హంగులు చేస్తారని ప్రభువునందు విశ్వాసముతో సెలవు తీసుకుంటున్నాను.

–కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర, ఎడిటర్

**K. Samuel Rajendra, SBI Collector Office Branch, Ongole**
**A/c No. 10957294362**

సీరియల్

# జప్నత్పనేహు

**(యోసేపు జీవితచరిత్ర)**

**- కొడవటికంటి**

**మరీ ప్రొద్దున్న నిద్రలేవటం అంటే కష్టంగానే ఉంది. పొలంలో అన్నలతో ఉన్నప్పుడు ఎవరూ నిద్రలేవకముందే నిద్ర లేచేవాడు. సూర్యకిరణాలు ఎర్రగా ఉన్నప్పుడు, కొండమీద పచ్చని పచ్చిక మీద పడినప్పుడు అక్కడక్కడ తెల్లని చారల్లాగ కనిపించే రాళ్ళు - ప్రొద్దెక్కిన తరువాత నిప్పుల్లాగ కనబడేవి.**

**ఇప్పటికి సంవత్సరం నుండి తను అన్నలతోపాటు మందతో వెళ్ళడం లేదు. ఇంటివద్ద అసలు పని ఉండదు. గాడిద మీద కూర్చుని - రోజు పది నుండి పదిహేను మైళ్ళు ఈనిన ఒంటెల దగ్గర, చిన్న చిన్న గాడిద పిల్లల దగ్గరకు తిరగటం! ఎటు వెళ్ళినా వంగి వంగి నమస్కారము చేసే బానిసలను చూస్తే చిరాకు వేసేది. ఒంటరిగా ఎక్కడికైనా వెళ్ళాలన్న ఆశ ఉన్నా అది ఆశగానే ఉండిపోయింది.**

ప్రతి రెండు గంటలకు ఒకసారైనా తన తండ్రికి కనిపించకపోతే ఇద్దరు బానిసలు వెతుకుతూ వచ్చేవారు. తనకి భలే కోపం వచ్చేది. ఒకసారి ఒక ఒంటె ఈనుతూ ఉంటే తను చూస్తుంటే, దాని కాపలావాడు తనను బలవంతంగా పంపించాడు. అసలు బొత్తిగా స్వతంత్రంలేని జీవితం అయిపోయింది. అప్పుడప్పుడు ఎటైనా దూరంగా పారిపోవాలని, పక్షుల్లాగా హాయిగా విహరించాలని, అప్పుడప్పుడు కనిపించే నక్కల్లాగా, ఎవరికీ చిక్కకుండా పరుగెత్తాలని అనిపించేది. కాని ఇన్ని వందలమంది పనివారి కళ్ళుగప్పటం మాటలా! ఒకసారి హారాను నుండి చుట్టము ఒకాయన పది ఒంటెలతో, నెలరోజులు ప్రయాణం చేసి వచ్చాడు. లాబాను చనిపోయాడని చెప్పాడు. మా అమ్మ చనిపోయిన సంగతి తెలుసుకొని ఆయన చాలాసేపు ఏడ్చాడు. ఆయన నన్ను ముద్దుపెట్టుకుంటుంటే చాలా చీదరవేసింది. ఇంతింత గడ్డాలు పెంచుకొని, మట్టివాసన, ఒంటె వాసన. అయినా ఓర్చుకున్నాను.

వాళ్ళు తిరుగుప్రయాణంలో తనని పద్దనరాము తీసుకొని వెళ్తామని అడిగారు. తను అంతా తల్లి పోలికేనని, అందగాడినని చెబుతుంటే భలే సంతోషం వేసింది. కొంచెం గర్వంగా కూడా ఉంది. అన్నలందరికంటే చక్కనివాడనని తండ్రి ఎవరితోనైనా చెప్పేటప్పుడు ఆ మాట ఎవరూ వినకూడదని చుట్టూ చూసేవాడ్ని. ఎందుకంటే ఇంతకు ముందు మంచి కలలు వస్తే వాళ్లు తిట్టేవాళ్ళు. తనకి కలలు వస్తే అన్నలకు ఎందుకు కోపమో తనకు అర్ధమయ్యేది కాదు.

షెకెములో కాపురమున్నప్పుడు మంచి ఇళ్ళు, మంచి పొలాలు ఉండేవి. గోధుమల గరిసెలు నిండిపోయేవి. మరలా పంట వచ్చేటంత వరకు సమృద్ధిగా ఉండేవి. హెబ్రోనులో యవలు మాత్రమే పండుతాయి. కాని కొండ ప్రదేశము. హెబ్రోను వచ్చిన తరువాత గుడారాలలోనే నివాసం. ఎన్ని గుడారాలు! దూరము నుండి “తలమిట్ట” మీద నుండి చూస్తే - అదే పెద్ద మిట్ట. పైకి వెళ్ళి చూస్తే గుడారాలన్నీ ఎన్నో చిన్నవి, పెద్దవి తన చిన్నతనంలో పద్దనరాములో ఉండే పొలాలలోని పుట్టగొడుగుల్లాగా కనిపించేవి.

తండ్రి ఎందుకో మంచి ఇల్లు కట్టడానికి ఇష్టపడలేదు. అక్కడక్కడ పశువులకు శాలలు కట్టించేవాడు. పని వారికి కూడ గుడిసెలు కట్టించాడు.

కాని పెద్దమ్మ, జిల్పా అమ్మకి, బిల్హా అమ్మకి పెద్ద గుడారాలు, తన తండ్రి గుడారము చాలా పెద్ద గుడారము. దానిని ఆనుకొని చిన్న చిన్న గుడారాలు. లోపల చల్లగానే ఉంటుంది కాని, పెద్ద గాలి వచ్చినప్పుడు వేగం యొక్క శబ్దం పూర్తిగా వినబడుతుంది.

యోసేపు అటు ఇటు కదిలాడు. తన కొరకు ఏర్పాటు చేయబడిన గది తండ్రి గది ప్రక్కనే ఉంది. బెన్ని ఎప్పుడూ

తండ్రి గదిలోనే ఉంటాడు. అక్కడే పండుకుంటాడు. భోజనానికి వచ్చేటప్పుడు కూడా తండ్రి వెంటే వస్తాడు. తల పూర్తిగా పైకి ఎత్తి మాట్లాడతాడు. మాట్లాడిన ప్రతి మాటకు తండ్రి వైపు చూసి 'సరిగ్గా మాట్లాడుతున్నానా? లేదా?' అన్నట్లు చూస్తాడు.

ద్వారం దగ్గర శబ్దమైంది. అంటే మరలా తండ్రి దగ్గర్నుండి పిలుపు. పూర్తిగా తెల్లవారలేదు. అయినా ప్రయాణం తప్పదు. ఆయా వచ్చింది. ఆమె బాగా పెద్దామె అయింది. పద్దనరాము నుండి బయలు దేరినప్పుడు ఆమె చాలా చురుకుగా ఉండేది. షెకెములో జబ్బు చేసినప్పటి నుండి అంత హుషారుగా లేదు. ఆమె ఏమి చెప్పకపోయినా ఆమె చూపును బట్టి, తండ్రి పిలుస్తున్నాడని అర్థమైంది. పరుపు ప్రక్కన రాత్రి విప్పిన అంగీ వేసుకొని, అద్దంలో చూసుకున్నాడు. ముఖం వాచినట్లుగా ఉంది. రాత్రి మంచి నిద్రపట్టింది. తల దువ్వుకొని బయటకు వచ్చాడు. తలకు గుడ్డ కట్టుకుంటూ బయటకు వచ్చాడు.

అప్పటికే తన గాడిద ఐగుప్తుకి జీను తగిలించారు. అది బలమైన గాడిదే! చిన్నప్పటినుండి తనే పెంచాడు. ముందు కాళ్ళు కదిలేటప్పుడు వెనుక కాళ్ళ కంటే ఎక్కువ శబ్దం చేస్తుంది. అందుకని అన్నలు దానిని ఐగుప్తు అని పిలిచేవారు. వారి ఉద్దేశ్యంలో ఐగుప్తులాగా గర్విష్ఠి అని.

అయితే తనకి ఆ పేరు బాగుంది. ఎందుకంటే ఇది ఐగుప్తులాగా సమృద్ధిగలది. ఈ రెండు సంవత్సరాలలో ఒక్కసారి కూడా జబ్బు చెయ్యలేదు.

తమ సంస్థానంలో ఎన్నో గాడిదలు – మంచివి, చక్కనివి ఉన్నా ఐగుప్తు నుండి తిరిగి వస్తున్న గిలాదు వారి దగ్గర మొదటిసారి చూచినప్పుడు భలే ముద్దు వేసింది. తండ్రిని అడిగాను గాడిద పిల్లని కొనియ్యమని. తండ్రి ఆశ్చర్యంగా చూచాడు. "ఎందుకు? ఇన్ని వేల గాడిదలలో నీకు ఒక్కటి కూడా నచ్చలేదా?" అన్నాడు.

తను జవాబు చెప్పకుండా గాడిద వైపే చూస్తున్నాడు. అది ఈ మధ్యనే పాలు మానినట్లుంది. దాన్ని చూసేకొద్దీ దానిమీద ప్రేమ ఎక్కువయింది. నిజమే, తండ్రి ప్రేమ చెప్పలేని ప్రేమ. తనకంటివెంట ఒక్క బొట్టు కన్నీరు వచ్చినా ఆయన ఓర్చలేడు. గుడారాల పరదాలు ఎగిరిపోయేటట్లుగా అరుస్తాడు. పనివాళ్ళందరినీ గడగడలాడిస్తాడు.

ఒక పొట్టేలు పిల్లని వాడికిచ్చి, ఆ గాడిదని కొన్నాడు. అప్పటి నుండి అది తన దగ్గరే, తన గుడారం ముందే కట్టేసేవారు. అది పెద్దయిన తర్వాత పెద్దగా ఇబ్బంది పెట్టకుండానే స్వారీకి అలవాటు అయింది. దాని మెడ మీద చేయి వేసి నిమిరాడు. అది కూడా ప్రేమగానే తల పైకెత్తి పై పెదవి, క్రింది పెదవీ చూపింది. సాధారణంగా ఉదయం దాన్ని పలకరిస్తే అట్లాగ పెడుతుంది.

వీపు మీద చిన్నగా తట్టి తండ్రి గుడారం దగ్గరికి వచ్చాడు. అప్పటికే తండ్రి రెండు గోనె సంచుల మూతులు బిగిస్తున్నాడు. ఒకదానిలో వేయించిన గోధుమలు, కాల్చిన రొట్టెలు ఉన్నవి. ఇంకొక దానిలో ఏముందో? బహుశా వేయించిన మాంసం, ఒంటెలూ, గుడారాల మధ్యలో ఉండే శాలలో ఉంటాయి. ఎప్పుడూ అయిదు ఒంటెలన్నా ఈని ఉంటాయి. అందువల్ల సంవత్సరంలో అన్ని రోజులూ జున్ను సమృద్ధిగా దొరుకుతుంది. ఆషేరు అన్నకి జున్ను గడ్డలంటే భలే ఇష్టం.

తండ్రి పలకరింపుగా చూసినా, ఈ రోజు ఎందుకో విచారంగా ఉన్నట్లు కనిపించాడు. తన వైపు చూసినప్పుడు కొంచెం చూపు నిలబెట్టి తనని కాళ్ళ దగ్గర్నుండి తల మీద పాగా వరకు పరిశీలనగాను, క్రొత్తగాను చూశాడు.

"తొందరగా బయలుదేరాలి, లేకపోతే చీకటి పడేలోపు మజిలీ చేరలేవు" అని "యెబూసు దగ్గర, మోరియా కొండల దగ్గర వాగు నీళ్ళు బాగుంటాయి. అక్కడ మధ్యాహ్నం విశ్రాంతి తీసుకో. లేకపోతే ఐగుప్తు అలసిపోయి ప్రయాణంలో ఇబ్బంది పెడుతుంది. తొందరగా సిద్ధపడిరా. వచ్చేటప్పుడు కైజారు నడుముకు కట్టుకో. చిన్నది కాదు పెద్దది, షీనారు నుండి వచ్చిందే అది. నన్ను కాచిన సర్వశక్తుని సన్నిధి నీకు తోడుగా ఉంటుంది" అని దీవించాడు.

జీవితంలో మొదటిసారిగా ఒంటరిగా ప్రయాణం చేస్తున్నాడన్న భయమున్నా, తను ఈ క్షణంలో పెద్దవాడనై పోయినట్లుగా, తండ్రికి సహాయ పడగలిగినంతగా ఎదిగి నందుకు కొంచెం సంతోషంగా ఉంది. పది గజాల దూరంలో లేయా పెద్దమ్మ, గుడారం వాకిలి దగ్గర నిలబడి

చూస్తుంది. పెద్దమ్మ దగ్గరకు వెళ్ళి కాళ్ళు కళ్ళకద్దు కున్నాడు. పెద్దమ్మ నొసటి మీద ముద్దుపెట్టుకుంది. ఆమెకి తన కుమారుల సంగతి చాలాకాలంగా తెలియనందుకు బాధ పడుతుంది. తనని ఒంటరిగా పంపించడం ఆమెకి కూడా ఇష్టం లేదు. కాని, పనివారు తెచ్చే సమాచారం మీద ఆమెకు నమ్మకం లేదు.

యోసేపు తల్లి చనిపోయిన తర్వాత ఎక్కువభాగం ఆమె దగ్గరే పెరిగాడు. తన కుమార్తె దీనా కంటే రెండేళ్ళు చిన్నవాడు. దీనాకి యోసేపుకు ఎక్కువ స్నేహం. ఇద్దరూ చిన్నతనం నుండి కలిసి తిరిగి ఆడుకునేవారు. దాదాపు ఒకే ఈడువారు అయినందువల్ల వారిద్దరూ ఒకటిగా పెరిగారు. అందుకే లేయాకు యోసేపు మీద ప్రేమ ఉండేది. ఇంతకుముందు కూడా యోసేపు ఇల్లు వదిలి అన్నలతో మందల వెంబడి వెళ్ళాడు. చాలా రోజుల వరకు ఇంటికి రాకుండా ఉన్నా దిగులు పడలేదు. కాని ఈసారి ఒంటరిగా ప్రయాణం చేస్తున్నాడాయె. అదీకాక డెబ్భై మైళ్ళ ప్రయాణం. వెళ్తున్న మార్గం ఇంతకుముందు ప్రయాణం చేసిందే! పరిచయమున్న మనుష్యులు మార్గంలో ఉన్నారు. చిన్నవాడిని ఒంటరిగా పంపించాలంటే కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగాయి. అది చూచిన యాకోబు ఆశ్చర్యపడ్డాడు. లేయా తన చెల్లెలి కుమారుడిని ఇంతగా ప్రేమిస్తుంది అని తెలియదు. అసలు నిజానికి లేయాకే తెలియదు – ఆమె హృదయంలో యోసేపు మీద అంత ఆప్యాయత ఉందని. కొన్ని కొన్ని విషయాలు కొన్ని పరిస్థితుల్లో కాని వాటంతట అవే బయటపడవు.

యాకోబు వంతుగా ప్రయాణం త్వరపెట్టవలసింది. కాబట్టి యోసేపును పిలిచాడు. లేయా యోసేపు తల మీద నుండి తన చెయ్యి తీసింది. పెద్దమ్మ ముఖంలోకి ఒకసారి చూసి నిట్టూర్పు విడుస్తూ తండ్రి దగ్గరకు నడిచాడు. ఐగుప్తుకు యోసేపు నడక అర్థం అయింది. తండ్రి దగ్గరకు వచ్చి వంగి తండ్రి కాళ్ళ మీద కుడిచేయి ఉంచి వెంటనే లేచి ఐగుప్తును చూచి కళ్ళెం చేత్తో పట్టుకొని కొంచెం ముందుకు నడిచాడు. ఐగుప్తు వెంబడి వచ్చే ఇంకొక గాడిద కూడా కదిలింది. సాగనంపటానికి వచ్చిన పెద్ద సేవకుడు, అతని ఇద్దరు అనుచరులు వారి ఒంటెలతో కదిలారు. కదిలిన కొంచెంసేపటికి కంటికి కనుమరుగయ్యారు. పది నిమిషాలు యోసేపుతో నడచి ఖర్జూరపు చెట్టు దాటగానే వెనక్కు తిరిగారు. యోసేపు ఆఖరిసారిగా వెనక్కు తిరిగిచూశాడు. తండ్రి ఇంకా చూస్తున్నాడు. ఇప్పుడు పెద్దమ్మ కూడా ప్రక్కన నిలబడి ఉంది.

యోసేపుకు దుఃఖం పొర్లి వచ్చింది. ఇంతవరకు తను అణుచుకొనిన దుఃఖం పూర్తిగా కట్టలు తెంచుకున్నట్లయింది. ఇప్పుడు తను హృదయపూర్వకంగా ఏడ్వవచ్చును. ఒక్కొక్క మూరెడు తన ప్రయాణంలో గుడారాలు చిన్నవిగా కనబడు తున్నాయి. తండ్రి ఇప్పుడు కనబడటం లేదు.

గంట ప్రయాణం తర్వాత వెనక్కి తిరిగి చూస్తే గుడారాల పట్టణమైన యాకోబు నివాసములు పూర్తిగా కనుమరుగై ఆ స్థానంలో అక్కడికి మైలు దూరంలో ఉన్న సజీము కొండ కనబడుతుంది. ఇక యోసేపు వెనక్కు తిరిగి చూడలేదు. సూర్యుడు ఇప్పుడు సరిగ్గా తన కుడిచెంప మీద సూటిగా పడుతున్నాడు. ఎక్కడ చూసినా ఇసుక. అక్కడక్కడ ఖర్జూరపు వృక్షాల గుంపులు కనబడుతున్నాయి.

తన తండ్రి చెప్పిన మోరీయా దేశం ఇంకా పదిహేను మైళ్ళ దూరంలో ఉంది. అక్కడే యెబూసు గ్రామం ఉంది. రాత్రికి అక్కడే మజిలీ. తను ఇంతకుముందు ఆ దారిలోనే షెకెము నుండి వచ్చాడు. అప్పుడు తన తల్లి కూడా బ్రతికి ఉంది. బెన్యామీను ఇంకా భూమి మీదకి రాలేదు. పగలు మూడవ జాముున కాని అమ్మ సమాధి దగ్గరకు చేరుకోలేదు.

ఆ రోజు తనకింకా గుర్తే. ఆయా వచ్చి “మీ అమ్మ నీకు ఒక తమ్ముడ్ని ఇస్తుంది” అని చెప్పినప్పుడు భలే సంతోషం వేసింది. ఎందుకంటే అందరికంటే చిన్నవాడినని తన మీద అందరు పెత్తనం చేసేవారే. కాని తండ్రిని చూస్తే అందరికీ భయమేగా. ఇంతకాలానికి తన తమ్ముడి ద్వారా తను పెద్దవాడనైపోతాను అని ఎదురుచూస్తున్న వారందరిలో, తన తండ్రితో సహా షెకెములో అన్నలు చెరపట్టిన స్త్రీలు, పిల్లలు, దాస దాసీ జనము, పెద్దసమూహము, పశువులు, నాటు వాహనాలు అన్నీ ఆగిపోయాయి.

అందరి నోటా ఒకటే మాట, రాహేలమ్మ నొప్పులు పడుతుంది. ఆమె ప్రసవం కోసం అందరూ అన్ని

రకాలుగా ఆలోచిస్తున్నారు. కొంతమంది సంతోషంగా ఎదురు చూస్తుంటే, అనుభవజ్ఞులైన స్త్రీలు అనుమానంగా చూశారు. మొదటి కాన్పు రాహేలు వివాహ జీవితం ప్రారంభమైన పదిహేను సంవత్సరాలకు జరిగింది. ఆ కాన్పు చాలా బాధాకరంగాను, భయంకరంగాను జరిగింది. ఇప్పుడు మరలా పదిహేను సంవత్సరాల తర్వాత కాన్పు సుఖంగా జరుగుతుందా? అని అనుమానం వ్యక్తం చేశారు. తను మాత్రం ఏ అనుమానం లేకుండా పుట్టబోయే తమ్ముని కోసం ఎదురుచూస్తున్నాడు.

తన తండ్రి ఒంటరిగా ఆ రాత్రి గదిలో ఆయన ఒక్కడే ఎవరితోనో మాట్లాడినట్లుగా మాట్లాడుతున్నాడు. అయితే ఉదయాన్నే తను నిద్ర లేచేసరికి అంతా నిశ్శబ్దంగా ఉంది. ఎవరూ ఏ పని చేయడంలేదు. రోజూ పనివాళ్ళు చేసే గోల, వారి అరుపులు వినపడడం లేదు.

బయటికి వచ్చి చూస్తే అందరూ విచారంగా కనిపించారు. చుట్టూ ఉండే మందలు, మనుష్యులు, డేరాలు, ఒకటేమిటి – యవల పొలాలు కూడ బరువుగా ఉన్నట్లు కనిపించాయి. తనని చూడగానే అంత గంభీరమైన తన తండ్రి కూడా తనని కౌగిలించుకొని బావురమన్నాడు. సంగతేమిటో తెలియకపోయినా తను కూడా వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. అమ్మ కనిపించలేదు. తమ్ముడు చిన్న బొమ్మలాగా ఉన్నాడు. తమ్ముడికి స్నానం చేయిస్తున్నారు.

పరుగెత్తుకుంటూ అక్కడికి వెళ్తే ఆ స్నానం చేయించే ఆయా ప్రక్కనే ఉన్న పెద్దమ్మ కూడా పెద్దగా ఏడ్చింది. అప్పుడు కాని అర్థం కాలేదు – అమ్మకి ఏదో ఆపద వచ్చిందని. ఆ మధ్యాహ్నం అక్కడనే అమ్మని పాతిపెట్టారు. తరువాత రోజు అమ్మ కోసం ఏడ్చాను. కాని అమ్మ సమాధి మీద తండ్రి కట్టిస్తున్న స్థంభం – పనివాళ్ళు కడుతూ ఉంటే చూస్తూ తన తండ్రి ప్రక్కనే కూర్చునేవాడు. తన తండ్రి భోజనానికి వెళ్ళేవాడు కాదు. కాని తనని మాత్రం భోజనం చేయమని కోప్పడేవాడు. ఆ స్థంభం పూర్తి అయిన తర్వాత అక్కడ నుండి అందరూ బయలుదేరి 'మిగ్దల్ – ఏదేల్' అవతల గుడారాలు వేశారు.

యోసేపు కన్నులెత్తి చూచినప్పుడు సాయంకాలం నాల్గవ జాములో ప్రవేశించి రెండు గంటలైంది. దూరంగా ఎడమప్రక్కన సూర్యుడు అస్తమించబోతున్నాడు. తన తల్లి సమాధి స్థంభం కనబడుతుంది. ఐగుప్తు ఏమి అలసిపోలేదు. తన జీవితంలో ఈ రోజు గడిపినంత గంభీరంగా, ఒంటరిగా ఇంతకుముందు ఎప్పుడూ గడపలేదు. ఇంక ఒక్క గంటలో యెబూసు చేరవచ్చు. కాని ఒక గంటైనా తల్లి సమాధి ప్రక్కన కూర్చోవాలని అనిపించింది. ఆ సమాధి చేరే కొద్ది గుండె బరువెక్కుతున్నట్లుగా, గాలి భారంగా పీల్చవలసి వచ్చింది. తన తల్లి నవ్వుతున్నట్లుగా కనిపించింది.

ఇక ఎన్నడూ తన తల్లి రూపం తను చూడలేదని అనిపించినపుడు ఎక్కడో అమ్మ పిలుస్తున్నట్లుగా అనిపించింది. లేదు, పిలుస్తుంది. ఎక్కడికో పరుగెత్తుకుంటూ వెళ్తే అమ్మ కనిపిస్తుంది. ఏదో చెయ్యాలి, అమ్మ కనిపించాలి. పెద్దగా అరవాలని, దూరంగా కనబడుతున్న మోరియా కొండలు ప్రాకి ధ్యానించాలని, ఈ భూమినంతా దున్నివెయ్యాలని, చెట్లన్ని పెరికి వెయ్యాలని అనిపిస్తుంది. ఎంతసేపు ఆ సమాధి స్థంభం ముందు నిలబడ్డాడో తనకే తెలియదు. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**
Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

# నీ చింత దేని కొరకు?

ఈ భూమ్మీద ఉన్న ప్రతి ఒక్కరిని ఏదో ఒక చింత వేధిస్తు ఉంటుంది. ఉదాహరణకు పిల్లలకు స్కూల్‌కి వెళ్లాలంటే కష్టంగా ఉంటుంది. కోటి విద్యలు కూటి కొరకే, రెక్కాడితే కాని డొక్కాడదు అన్న సామెతలు మనుష్యులు పుట్టించినవే. వాటి ప్రకారమే జీవిస్తుంటారు. కానీ దేవుడు ఏం చెప్తున్నాడు. "ఏమి తిందుమో ఏమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకుందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారము కంటే ప్రాణమును, వస్త్రము కంటే దేహమును గొప్పవి కావా?" (మత్తయి 6:25). దేవుడు అనుగ్రహించిన దేహము ప్రాణము గురించి కాక ఆహారము వస్త్రము గురించి చింతించటం ఎంత అవివేకం?

ఆకాశపక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటే బహు శ్రేష్ఠులు కారా? (6:26). అడవి పువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు, ఒడకవు. అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము వీటిలో నొకదానివలెనైనను అలంకరింపబడలేదు. నేడుండి రేపు పొయ్యిలో వేయబడు అడవిగడ్డిని దేవుడీలాగు అలంకరించిన యెడల అల్పవిశ్వాసులారా మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింపజేయును గదా. (6:28-30).

పై వాక్యాలనుబట్టి మనం ఏం అర్థం చేసుకోవాలి? ఆకాశపక్షులను దేవుడు పోషిస్తున్నాడు. అడవి పువ్వులను దేవుడు ఆలంకరిస్తున్నాడు. మరి తన స్వరూపములో తన పోలికె చొప్పున సృజించుకున్న మనిషిని ఇంకెంత అపురూపంగా చూసుకుంటాడో అని అర్థం చేసుకోలేక పోవడం మనిషి మూర్ఖత్వానికి నిదర్శనం. ఆకాశపక్షులు విత్తవు, కోయవు, కొట్లలో కూర్చుకొనవు. అడవిపువ్వులు కష్టపడవు ఒడకవు. కాని మనుష్యులు మాత్రం ఇవన్నీ చేస్తారు. ఆకాశపక్షులు, అడవిపువ్వులు దేవుని మీద ఆధారపడతాయి కాబట్టి దేవుడు వాటి విషయం ఆలోచిస్తున్నాడు. కానీ మనుషులు దేవునిపై కాకుండా వాళ్ళపై వాళ్ళు ఆధారపడుతూ ధనమును ఆశ్రయిస్తారు. అందుకే దేవుడు మనుష్యులను పోషించడు. ఎందుకంటే మనుష్యులు తమ్మును పోషించే అవకాశం దేవునికి ఇవ్వరు.

ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశము నుండి కనాను దేశమునకు బయలుదేరిన కాలమంతా అనగా 40 సంవత్సరాలు దేవుడు వారిని పోషించాడు. ఒక్కరు ఇద్దరు కాదు సుమారు 20 లక్షల మందిపైగా ఉన్న ఇశ్రాయేలీయులను 40 సంవత్సరాలు అంటే ఒక మనిషి సంపాదించగలిగినంత కాలం దేవుడు వారిని పోషించాడు. దేవదూతల ఆహారం వాళ్ళకి పెట్టాడు. ఏది కావాలంటే అది వాళ్ళకి అందించాడు. వాళ్ళ కాలు వాయలేదు, వారి బట్ట నలగలేదు. అంతగా వాళ్ళని చూసుకున్నాడు దేవుడు. వాళ్ళు ఎంతగా అవిధేయత చూపించినా కూడా ఇచ్చిన మాట కోసం వారిని పోషించాడు. 20 లక్షల మందే కాదు ఈ భూమి మీద ఉన్న 800 కోట్ల మంది దేవుని మీద ఆధారపడ్డా కూడా దేవుడు పోషించగల సమర్థుడు. అయితే మనిషి దేవున్ని లెక్కచెయ్యడు. అసలు దేవుడే లేడనే వాడికి దేవుడు మాత్రం ఏం చెయ్యగలడు. ఈ లోకంలో మనుష్యులు వాళ్ళను పోషించుకోవడానికి పడే పాట్లు చూసి దేవుడు ఎంతో బాధపడుతుంటాడు.

సొలొమోను యొక్క వైభవం ఎంతో గొప్పది. భూమి మీద అంతటి జ్ఞాని కాని, అతనికున్న ఐశ్వర్యము కాని, అతని పేరు ప్రఖ్యాతులు కాని ఎవరికీ లేవు. అంతటి గొప్ప వ్యక్తి కూడా అడవిపువ్వులా అలంకరింపబడలేదు అని దేవుడు చెప్తున్నాడంటే, అడవిపువ్వు పట్ల దేవుడు ఎంత శ్రద్ధ వహించాడో మనం అర్థం చేసుకోవాలి. ఒక్కరోజు ఆయుష్షు ఉన్న అడవిపువ్వుకే అంతటి అందాన్నిచ్చి అలంకరించాడంటే 70 సంవత్సరాల ఆయుష్షు ఇచ్చిన మనిషిపట్ల దేవుడు ఇంకెంత శ్రద్ధ వహిస్తాడో మనం ఆలోచించాలి.

ఆహారము, వస్త్రము కోసం చింతించడం, వాటిని సంపాదించుకోడానికి దేహము, ప్రాణము అనుగ్రహించిన దేవుడిని

లెక్క చెయ్యకపోవడం. తమ్మును తాము పోషించుకోవడమే జీవిత పరమావధి అని భావించడం అవివేకం. అన్యజనులు వీటన్నిటి విషయం విచారింతురు అంటే క్రైస్తవులు కాకుండా ఇతర మతాల వాళ్ళు అని కాదు కాని, దేవుడిని ఎరుగని జనాంగము అని అర్థము. క్రైస్తవులలో కూడా దేవుడిని ఎరుగని వాళ్ళు అనేకమంది ఉన్నారు. ఆ మాటకొస్తే ఎవరైతే ఆహారము కొరకు వస్త్రము కొరకు చింతిస్తుంటారో వాళ్ళంతా అన్యజనాంగమునకు చెందిన వారే. ఎందుకంటే దేవుడిని ఎరిగిన వాళ్ళు వీటి కోసం ఎప్పుడూ చింతించరు. ఇవన్నీ మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. ఆకాశపక్షులకు ఎలా అయితే దేవుడు ఆహారము సిద్ధ పరుస్తున్నాడో, వాటికంటే బహు శ్రేష్ఠులైన మనుష్యుల కోసం కూడా సిద్ధపరుస్తాడు. దేవునిపైన ఆధారపడిన వారు మాత్రమే వాటిని పొందుకుంటారు.

ప్రభువైన యేసుక్రీస్తు తన సేవా పరిచర్యలో చేసిన ప్రసంగాలలో కొండమీద ప్రసంగము ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నది. మనుష్యుల జీవన విధానానికి సంబంధించిన ఎన్నో విషయాలు చక్కని ఉదాహరణలతో అందరికీ అర్థమయ్యేలా బోధించాడు. ధర్మశాస్త్రం నెరవేర్చటానికి సులభమైన మార్గాలు బోధించాడు. మూడు అధ్యాయాల పాటు సాగిన సుదీర్ఘ ప్రసంగంలో మనుష్యులు వారి దైనందిన జీవితంలో పాటించాల్సిన ఎన్నో విషయాలు బోధించాడు.

ధనమును గూర్చి చెప్పేటప్పుడు దేవునితో సమానంగా ధనమును పోల్చాడు. “ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు” (మత్తయి 6:24). ప్రపంచంలో ఎవరికైనా సరే రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి దేవుడు, రెండు ధనము. ఏ మనిషి అయినా సరే తను జీవించటానికి దేవుడిని ఆశ్రయించాలా? లేక ధనమును ఆశ్రయించాలా? అన్నది తానే నిర్ణయించుకోవాలి. ద్వితీయోపదేశకాండము 30:19లో దేవుడు “నేడు జీవమును మరణమును, ఆశీర్వాదమును శాపమును నేను నీ యెదుట ఉంచి” అని చెప్తున్నాడు. ఎలాగైతే దేవుడు జీవమును మరణమును, ఆశీర్వాదమును శాపమును ఉంచి ఎన్నుకోమని చెప్తున్నాడో అలాగే దేవుడిని ధనమును కూడా మన ముందు ఉంచాడు. ఏదైనా సరే ఒక్కటి మాత్రమే ఎన్నుకోవాల్సి ఉంటుందే తప్ప రెండు ఎన్నుకొనే అవకాశం ఉండదు. అంటే దేవుడూ, ధనమూ రెంటిని కోరుకునే అవకాశం లేదు. చాలామంది ధనమును, దేవుడిని ఏకకాలంలో ప్రేమించాలనుకుంటారు. కాని అది అసాధ్యం. ధనమును ప్రేమించే మనసుతో దేవుడిని వెంబడించాలనుకోవడం వెఱ్ఱితనం. దేవుని మాటలు నిరర్థకము కానేరవు. ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా ఉండనేరడు అని దేవుడు చేప్తే నేను ఉండగలను అనుకోవడం భ్రమపడటం అవుతుంది. ఈ లోకంలో జీవించాలంటే ధనము తప్పనిసరి అని ప్రతి ఒక్కరూ భావిస్తారు కాబట్టి ధనము అనే యజమాని క్రింద పనిచేస్తూ ధనమును ప్రేమిస్తూ దేవుడిని ద్వేషిస్తారు.

విచారించదగ్గ విషయమం ఏమంటే అందరూ ధనము గురించి చింతిస్తూ, ధనమును ప్రేమిస్తూ, దేవున్ని దూషిస్తున్నారన్న సంగతి కూడా తెలియని స్థితిలో ఉన్నారు.

## కృతజ్ఞతలు

1999లో ‘నిత్యజీవజలము’ మాసపత్రికను స్థాపించి, నాలుగు సంవత్సరములు దిగ్విజయముగా నడిపించి, పోస్టల్ రాయితీ లేనందువల్ల పత్రిక పేరును ‘హన్నాకృప’గా రిజిస్టర్ చేయించి, పోస్టల్ రాయితీ పొంది, మా తండ్రి గారైన కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారి ఆధ్వర్యంలో గత 19 సంవత్సరాలగా నిరాటంకంగా ప్రచురింపబడుతూ ఉంది. ఆయన వయస్సు రిత్యా (82 సం॥లు) ‘హన్నాకృప’ పత్రిక పూర్తి బాధ్యతలను నా మీద నమ్మకంతో నాకు అప్పగించినందుకు దేవునికి, మా తండ్రిగారికి మనఃస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను. పాఠకులందరూ మా తండ్రిగారికి అందించిన సహాయ సహకారములను నాకును అందించి పత్రిక అభివృద్ధికి తోడ్పడగలరని ఆశించుచున్నాను. మీ అమూల్యమైన సలహాలను 9440217726 అను నంబరుకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా అందించగలరు.

**ఇట్లు, కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర**

# దేవుడు - సిరి

ధనవంతుడైన యవ్వనస్తునితో యేసుప్రభువు నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము అన్నాడు. అంటే నీ **జీవనమంతయు...** అని అర్థము.

ఆనాడు ఆ ధనవంతుడైన యవ్వనస్తుడే కాదు, ప్రక్కనున్న వారు కూడా యేసునోట ఆ మాట వస్తుందని ఊహించియుండరు. కాని ఇది యథార్థము. ఆయన చెప్పిన మాట ప్రకారం చేస్తేనే అతని ప్రశ్నకు జవాబు వస్తుంది. ఆ జవాబు రానంతకాలము అతనికి ఈ లోకంలో నెమ్మది, సంతోష సమాధానములు రావు.

యేసుప్రభువు అదే మాట ఈనాడు మనకు సెలవియ్యటం లేదా? ఈ లోకంలో ఎంత డబ్బును మనం కలిగియున్నాము అనే దానిని బట్టి మన సుఖసంతోషాలు ఆధారపడియుండవు. **పరలోకంలో నీకు ధనము కలుగును.** అంటే ఈ లోకములో మన స్థితి ఎట్లున్నప్పటికి మనం సుఖసంతోషాలతో ఉండాలంటే పరలోకములో మనము ధనము కలిగి ఉండాలని అర్థము.

ప్రతి ఒక్కరు పరలోకములో బ్యాంక్ బ్యాలెన్స్ కలిగియుండవచ్చును. ఈ ధనవంతునికి ఈ లోకములో ఎంతో ధనమున్నది. కాని పరలోకములో అతనికి ధనము లేదు. పరలోకములో మనం దాచుకున్న డబ్బు మనం పరలోకము వెళ్ళిన తర్వాత వాడుకోవడానికి కాదు. ఇక్కడ ఈ లోకములో జీవిస్తూనే అవసరానికి పరలోకములోని డబ్బును వాడుకోవచ్చును. దాన్ని ఆపరేట్ చేసేది మన పరమతండ్రి!

నేను నా ప్రయాణాలలో అంటే పత్రిక సంపాదకునిగా ఒరిస్సానుండి చెన్నై వరకు, ఒంగోలునుండి పులివెందుల, కర్నూలు వరకు గమనించినది ఈ సత్యమే! ఈ లోకములో ధనవంతులుగా ఉండిన వారికంటే ధన హీనులుగా ఉన్నవారే పరలోకములో ధనము కూర్చుకోవడం గమనించి ఆశ్చర్యపోయాను. ఇప్పటికి ఆలోచిస్తుంటే పరలోకములో ధనము కూర్చుకొనిన వారి ఇంటిలోను, హృదయములోను సమృద్ధి కలిగివున్నారు. తృప్తి – సమృద్ధి కలిగియున్నారు.

అసలు దేవుని దగ్గర (పరలోకములో) ధనము దాచుకుంటున్నాము అని తెలియకుండానే, ఆలోచన లేకుండానే వారు ప్రతిరోజు పరలోకములో ధనము కూర్చుకొంటున్నారు.

కానుక పెట్టెలో తమ కానుకలు వేయుచున్న **ధనవంతులను** ఆయన పారచూచెను. వారు నిజంగా ధనవంతులు. గొప్ప కానుకలు అందులో వేస్తున్నారు. ఒక బీద విధవరాలు వచ్చింది. ఆమె నిజానికి యేసు దృష్టిలో నిజమైన ధనవంతురాలు. పరలోకములో ఆమె ఎంత ధనము కూర్చుకున్నదో యేసుకు తెలుసు.

మన దగ్గర మన అవసరాలకు ఉంచుకొని తరువాత దేవునికివ్వటం కాదు. మన దగ్గర ఉన్నది, జీవనమంతయు... దేవునికి ఇచ్చి దానికి ఎన్నోరెట్లు రెట్టింపు దీవెనలు తీసుకొంటున్న ఆ విధవరాలు ఆయన దృష్టిని ఆకర్షించింది.

ఇప్పుడు మన జీవితం – భవిష్యత్తు మీద, సంపాదన మీద, మన వనరుల మీద ఆధారపడతాము. దానిలో అలవాటుపడతాము. అస్థిరమైన ధనమునందు నమ్మిక యుంచక సుఖముగా అనుభవించుటకు మనకు ధారాళముగా దయచేయు దేవునియందే నమ్మక యుంచాలి.

వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము రాబోవు కాలమునకు మంచి పునాది తమ కొరకు వేసుకొనుచు, మేలు చేయువారును, **సత్క్రియలు అను ధనము గలవారును,** ఔదార్యము గలవారును తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారునై యుండవలెను. అదే – నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము అనే దానికి అర్థము.

స్త్రీల విభాగము

# అబీగయీలు

రాజుల కాలంలో కర్మెలు ప్రాంతంలోని 'మాయెను' అనే ఊరిలో నాబాలు అనే ఆస్థిపరుడుండేవాడు. అతడు బహు భాగ్యవంతుడు. అతనికి మూడు వేల గొఱ్ఱెలు, వెయ్యి మేకలు ఉన్నాయి. పొలాలు, మాన్యాలు కూడా ఉన్నాయి. అతడు భాగ్యవంతుడే గాని మోటువాడు. దుర్మార్గుడు కూడా! ఎప్పుడు తినడం, మత్తుగా తాగడం అతని అలవాటు. అతని భార్య మాత్రం చక్కనిది, అందమైనది. అంతేకాదు సుబుద్ధి గలది, శాంత స్వభావము గలది కూడా. అందుకే అతడు దుర్మార్గుడైనా ఏ కలతలు లేకుండా సంసారం సాగిపోతుంది. ఆమె పేరు అబీగయీలు.

సౌలు దావీదును చంపాలని వెదకుతూ ఉన్న సమయంలో దావీదు తనదగ్గర నమ్మకంగావున్న ఆరువందల మంది మనుష్యులను వెంటబెట్టుకుని సౌలు నుండి తప్పించుకొని 'కెయిలా' నుండి 'మాయోను' అరణ్యములోకి వెళ్ళిపోయి అక్కడ దాక్కున్నాడు. నాబాలు గొఱ్ఱెలకాపరులు అదే అరణ్యంలో గొఱ్ఱెలను మేపుతున్నారు. దావీదు అతని అనుచరులు వారితో పరిచయ మేర్పరచుకొని వారితో స్నేహంగా ఉంటూ వారికి ఏ నష్టము కలుగకుండా తోడు నిలిచేవారు.

గొఱ్ఱెల బొచ్చు కత్తిరించు కాలం వచ్చినపుడు అక్కడివారు ఒకరికొకరు విందులు చేసుకోవడం ఆచారం. ఒకసారి అలాంటి సమయం వచ్చినపుడు నాబాలు ఇంట్లో గొప్ప విందులు జరుగుతున్నాయి. భాగ్యవంతులు గనుక మరింత అట్టహాసంగా జరుగుతూ ఉన్నాయి. నాబాలు భార్య అబీగయీలు రుచిగల భోజనాలు తయారుచేయడంలో ప్రావీణ్యురాలు. ప్రేమతో ఆతిథ్యం చేయడంలో ఆమెకెవరూ సాటిరారు. ఇప్పుడు ఇల్లు పసందైన వంటకాలతో, అతిథులతో బహు సందడిగా ఉంది. ఇక నాబాలు సంగతి చెప్పేదేముంది? బాగా తినడం, తాగి మత్తుగా పడివుండడం. అతడు తరచుగా చేసేది అదే కదా!

అతడు మద్యం తాగి మత్తుగా పడివున్నా జరగవలసిన రాచకార్యాలన్ని చక్కబెట్టగల సమర్ధురాలు అబీగయీలు. పనివారందరి యెడల దయాదాక్షిణ్యాలు చూపిన ప్రేమ పాత్రురాలు. ఇరుగు పొరుగు వారందరిలో గౌరవస్థానాన్ని నిలువబెట్టుకో గలిగిన జ్ఞానవంతురాలు. వివేక వంతురాలు.

విందు సమయంలో పిలువవలసిన వారందరినీ పిలచారే మోగాని దావీదును, అతని అనుచరులనూ మాత్రం పిలువ లేదు. దావీదు తనకు తానే ఈ విషయం విని తన అనుచరులలో పదిమందిని పిలిచి కర్మెలులోని నాబాలు దగ్గరకు పంపించి,'నీకును, నీ ఇంటివారికిని, నీకు కలిగిన అంతటికిని క్షేమమవునుగాక' అని కుశల ప్రశ్నలడిగిన తరువాత విషయం ఈ విధంగా తెలియజేయమన్నాడు. 'నీ యొద్ద గొఱ్ఱెల బొచ్చు కత్తిరించువారున్నారని తెలియ వచ్చింది. నీ గొఱ్ఱెల కాపరులు మా దగ్గరున్నప్పుడు, మేము వారికి ఏ కీడూ చేయలేదు. వారు కర్మెలులో వున్నప్పుడు ఏదీ పోగొట్టుకోలేదు. ఈ విషయం వారే చెప్తారు. కాబట్టి నా పనివారికి దయ చూపించు. నీకిష్టం వచ్చినట్టే నీ దాసులకు నీ కుమారుడైన దావీదుకు ఇవ్వాలి' అని దావీదు దాసులు నాబాలుకు చెప్పారు.

నాబాలు మోటువాడు, దుర్మార్గుడు, పైగా అతడిప్పుడు మత్తులో మునిగి తేలుతున్నాడు. అందుకే అతని నోటి వెంట మరి కఠినమైన మాటలు వచ్చాయి. 'దావీదు ఎవడు? యెష్షయి కుమారుడెవడు? ఎప్పుడో తమ యజమానుని వదలి పారిపోయిన పనివాళ్ళను ఎవరు జ్ఞాపకం వుంచుకుంటారు? నేను సంపాదించుకున్న నా అన్నపానాలు, నా గొఱ్ఱెల బొచ్చు కత్తిరించు వారి కొరకు నేను వధించిన పశుమాంసము నేను బొత్తిగా ఎరుగని వాళ్ళకు ఇస్తానా?' అంటూ మాట్లాడాడు. దావీదు పనివాళ్ళు ఈ మాటలన్నీ దావీదుకు చెప్పారు. దావీదుకు విపరీతమైన కోపం వచ్చింది. తెల్లవారేసరికి నాబాలు సంతతిలో ఒక్క మగపిల్లను కూడ వుండనియ్యకూడదని శపథం చేసి బయలుదేరాడు.

నాబాలు దాసులలో ఒకడు విషయం తెలుసుకొని నాబాలుకు చెప్పక జ్ఞానయుక్తంగా నడచుకోగల తమ యజమానురాలికి చెప్పాడు. మన యజమానుడు దావీదు దాసులతో కఠినంగా మాట్లాడాడు. వాళ్ళు మేము అరణ్యం లో గొఱ్ఱెలు కాస్తున్నప్పుడు మాకు చుట్టు కాపలాగా వుండి రాత్రింబగళ్ళు మాకు ప్రాకారంగా నిలిచి మాకు చాలా ఉపకారం చేసినవారు. ఇప్పుడు నీవు చేయవలసినది జాగ్రత్తగా ఆలోచించు అని చెప్పాడు.

అబీగయీలు ఒక్కమాట కూడ ఎవరితో ఏమియు చెప్పక త్వరపడి రెండు వందల రొట్టెలు రెండు ద్రాక్షతిత్తులు, వండిన ఐదు గొఱ్ఱెల మాంసం, ఐదు మానికల వేచిన ధాన్యం! మూడు ద్రాక్ష గెలలు, రెండు వందల అంజూరపు అడలు గాడిదల మీద వేసి తన దాసులతో ముందుగ పంపి (1సమూ 25:19). తానొక గాడిద ఎక్కి దావీదు దగ్గరకు బయలుదేరింది. తెల్లవారేలోగా నాబాలు సంతతిలో ఒక్క మగపిల్లనైనను బ్రతుక నియ్యకూడదని శపథం చేసి కత్తుల తోను ఆయుధాలతోను వస్తున్న దావీదు ఆమెకు ఎదుర య్యాడు. అబీగయీలు దావీదుకు సాష్టాంగ నమస్కారం చేసి అతని పాదాలు పట్టుకుని, నీ దాసురాలను అంది. దుష్టుడైన నాబాలు మాటలు లక్ష్యపెట్టవద్దన్నది. కీడు చేయకుండా ప్రాణహాని చేయకుండ యెహోవా చెయ్యి నిన్ను రక్షించింది. నా తప్పును క్షమించి తెచ్చిన కానుకను స్వీకరిం చుమని అతని వేడుకుంది. నీవు "యెహోవా యుద్ధాలు" చేసినవాడవు గనుక ఆయన నీకు శాశ్వత సంతతి ఇస్తాడని దీవించింది. నీవు బ్రతుకుదినాలన్ని నీకు ఏ అపాయము కలుగకూడ దంది. ఎవరైనా నిన్ను హింసిం చాలని, ప్రాణం తీయాలని చూస్తే నీ ప్రాణం దేవుడైన యెహోవా యొద్దనున్న "జీవపుమూట"లో కట్టబడుతుందని చెప్పింది.

అబీగయీలు వినయవిధేయతలు, దేవునియందు భయభక్తులు, జ్ఞాన వివేకములు దావీదు ధృఢనిశ్చయాన్ని మార్చేశాయి. వెంటనే ఆమెతో నేను పగతీర్చుకొనకుండ, ప్రాణం తీయకుండా నన్ను ఆపిన నీవు ఆశీర్వాదము నొందుదువుగాక! నీవు చూపిన బుద్ధి విషయమై నీకు ఆశీర్వాదము కలుగునుగాక! నీవు త్వరపడి ఎదుర్కొనక పోతే, యెహోవా జీవముతోడు నాబాలు కుటుంబములో ఒక మగపిల్లవాడు కూడ బ్రతికి వుండకపోను. ఇది నిశ్చయం అని చెప్పి ఆమె తెచ్చిన కానుకను తీసుకుని సమాధానంగా ఇంటికి వెళ్ళమన్నాడు.

అబీగయీలు తిరిగి తన ఇంటికి వెళ్ళి మత్తులో వున్న నాబాలుతో ఏమీ చెప్పలేదు. చెప్తే అల్లరి అవుతుందని. అందుకే జ్ఞానయుక్తంగా నడుచుకుంది. మొదటినుండి నాబాలు చేస్తున్న తప్పులు సవరించుకుంటూ వచ్చింది. **జ్ఞానవంతురాలు తన ఇల్లుకట్టును. మూఢురాలు తన చేతులతో తన ఇల్లు ఊడబెరుకును (సామె 14:1).**

అబీగయీలు జ్ఞానవంతురాలు. తన భర్త, మోటువాడై న, దుర్మార్గుడైన, తాగుబోతువాడైనా, అతని తూలనాడటం గాని, ఎవరికైనా అతడు పెట్టేబాధలు, అతడు చేసే దుర్మర్గపు పనులను గూర్చి చెప్పడంగాని, కోపపడడం గాని, విసుక్కో వడంగాని చేయలేదు. కనీసం పనివాళ్ళతో కూడా అతని గూర్చి మాట్లాడినట్టు కనబడదు. నాబాలు దావీదు సేవకుల తో పలికిన మాటలు చెప్పినపుడు ఆమె ఎవరితో ఏమీ మాట్లాడక తను చేయవలసిన పని చేసింది. అబీగయీలు అతనిని గూర్చి ఒక్కమాట పలికినట్టు కనబడదు. ఇంతటి ఓర్పు, సహనం కలిగిన శాంతమూర్తి అబీగయీలు. తెల్లవారి అతని మత్తు తగ్గే వరకు ఓపిగ్గా కనిపెట్టింది. అంతవరకు అతనితో ఏమీ చెప్పలేదు. ఉదయం అతని మత్తుపూర్తిగా తగ్గిన తరువాత జరిగిన సంగతులన్ని వివరించి చెప్పింది. అతనికి భయంతో గుండె పగిలింది. బిగుసుకుని పోయాడు. పది రోజులయ్యాక యెహోవా అతని మొత్తగా అతడు చని పోయాడు (25:37,38) **"పగతీర్చుకొనుట నా పని, నేనే ప్రతిఫలమిత్తును"**అని **ప్రభువు చెప్పాడు. (రోమా 12:19)**

దేవుడే అతనికి తగిన ప్రతిఫలం ఇచ్చాడు. మన శత్రువులు ఎటువంటివారైనా దేవునికి అప్పగించి సహనం తో కనిపెట్టడం ఎంతో మంచిది కదా! అబీగయీలు సహనం దావీదును కూడా పగతీర్చుకోకుండా ఆపింది. తానూ ఎంతో సహనం వహించింది. చాలామంది స్త్రీలు ఎప్పుడూ తమ భర్తలపై సణుగుకోవడం, విసుగుకోవడం, ఇతరులకు

**(మిగితాది 19వ పేజీలో)**

# నేను నీతో చెప్పలేదా?

నేను నీతో చెప్పలేదా? అని యేసు ప్రభువు – మార్తతో అన్నాడు. వ్యక్తిగతముగా మార్తను యేసుప్రభువు అడిగిన ప్రశ్న? " నీవు నమ్మిన యెడల దేవుని మహిమను చూతువు" ఈ మాట ఎన్నిసార్లు మార్తకు ఆయన చెప్పాడో! దాదాపు మూడు సంవత్సరముల కాలములో ఆయన ఎక్కువ సమయము బస చేసిన ఇల్లు వారిదే. ఆయన వ్యక్తిగత ప్రసంగాలు చేసిన వ్యక్తులు వారే. నాలుగు రోజులు క్రితం చనిపోయి సమాధిలో ఉండిన మృతునికి జీవం ఇచ్చే కార్యమునకు ఏర్పరచబడిన సమయములో–మార్త దేవుని క్రియకు అడ్డం వచ్చినప్పుడు యేసు పలికిన మాట, వేసిన ప్రశ్న–నేను నీతో చెప్పలేదా?

యేసు బిడ్డల కొరకు – అంటే ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారి నిమిత్తము సృష్టి సమస్తము ఏర్పరచబడినది. ఆయన ఎన్నుకొనిన వారి ద్వారా తన 'మహిమ'ను లోకములో ప్రత్యక్షపరచవలెనని దేవుని సంకల్పము.

మార్త ఇంటిని ఆయన ఎన్నుకొనినప్పుడు, అందుకై లేక మార్తకు దేవుని మహిమను చూపుటకు ఆయన బేతనియకు రావటానికి ఆలస్యము చేసాడు. ఆ సంగతి గ్రహించక, యేసుని ప్రేమను గ్రహించక, మార్త మరియ ఆయనతో మాట్లాడిన వైనము ఆయనకు కన్నీళ్ళు తెప్పించినవి. చివరికి లాజరును సమాధిలో నుండి ఆయన పిలువబోతే మార్తే అడ్డము వచ్చినది.

ఆయనను విశ్వసించి రక్షింపబడి రక్షణ జీవితాన్ని కొనసాగిస్తున్న మనకు–మన ద్వారా ఇతరులకు దేవుని మహిమను చూపించుటకు మన జీవితంలో దేవుడు ఏర్పరచిన దుఃఖపూరిత వాతావరణమును– సాతాను పెట్టే శోధనలు అని అనుకోరాదు.

బైబిలులోని అన్ని పాత్రలు దేవునికి లోబడిన ప్రతి జీవితము– దేవుని చేతనే నడిపించబడి జయకరముగా ముగిసినవి.

కనుక మనము ప్రభువును వెంబడించేవారమైతే మన జీవితములో ప్రతి కష్టము ద్వారా దేవుని మహిమను చూస్తాము. దేవుని మహిమను చూడగోరుటయే దేవుని బిడ్డ యొక్క ఆరాటమైయుండాలి. అందుకు మనకు కావలసిన ఓర్పు, నిరీక్షణ కొరకు ఆయన వైపు చూస్తే –నేను నీతో చెప్పలేదా? అని ఆయన మనలను బలపరుస్తుంటాడు.

ఈ లోకములో మనలను ఓదార్చ గలిగినా, బలపరచ గలిగినా, స్వస్థపరచగలిగినా, అవి కేవలం యేసు పలికిన పలుకులే– నాలుగు సువార్తలలో ఆయన నోటిలో నుండి వచ్చిన మాటలు ఉన్నవి. వాటిలో ఏమాటనైనా సరే ఎన్నుకొని ధ్యానించడం మనం అలవాటు చేసుకొంటే ఏ మానవుని యొద్దకు ఆదరణకై పరుగెత్తము విచారములలో, సంకటములలో, ఆర్థిక ఇబ్బందులలో, అవమానములలో కృంగినప్పుడు యేసును జ్ఞాపకము చేసికొంటే, ఆయన ఉదయాన్నే శిష్యులతో బయలుదేరి దాదాపు 25 మైళ్ళు నడిచి బేతనియ చేరినది మార్తను మరియను పరామర్శించ టానికి కాదు. ఈ నాలుగు రోజుల నుండి వారు పొందిన అవమానమును, యేసు నిమిత్తమైన నిందను సహోదరుని పోగొట్టుకొనిన దుఃఖమును తీసివేసి వారు పోగొట్టుకొనిన వన్నీ తిరిగి వారికి సమకూర్చుటకే, ఆయన శక్తికి హద్దు గలదా?

**అప్పుడు నేను యెహోవాననియు నా కొరకు కనిపెట్టుకొనువారు అవమానము నొందరనియు నీవు తెలిసికొందువు (యెషయా 49:23).**

# విడువని దేవుడు

దేవుడు మనలను ప్రేమిస్తున్నాడు అని అందరికి తెలుసు కానీ దానిని పూర్తిగా నమ్మం. నిజంగా నమ్మితే భవిష్యత్‌ను గురించి చింతించము. శ్రమలలో, బాధలలో కృంగిపోము. మనలో ప్రతి ఒక్కొక్కరి పట్ల ఆయన ప్రత్యేకమైన ప్రణాళిక కలిగి ఉన్నాడు. శ్రమలలో ప్రతి ఒక్కరు దేవుడు నన్ను మరచిపోయాడు అనుకుంటారు. కానీ ఆయన మీద ఆధారపడే వారితో ఆయన ఎల్లప్పుడు ఉంటాడు.

దేవుని నిజముగా నమ్మిన ఒక వ్యక్తి సాయంత్రం వేళ సముద్రతీరాన కూర్చొని అస్తమిస్తున్న సూర్యున్ని, ఆ సూర్యుని కిరణాలు పడి మెరుస్తున్న నక్షత్రాల వలె ఉన్న అలలు చూస్తూ దేవుని సృష్టి ఎంత అద్భుతమో కదా! అను కున్నాడు. దేవుడు తన జీవితంలో దేవుడు చేసిన మేలులను తలుచుకుంటు మనసులో దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లిస్తూ ఉండగా అకస్మాతుగా ఎవరో తనని పిలిచినట్లు అనిపించగా వెను దిరిగి చూసి ఆశ్చర్యపోయాడు. ఎందు కంటే తనను పిలిచింది ఎవరో కాదు సాక్షాత్తు యేసయ్యే. అప్పుడు అతను యేసయ్య ఆ వ్యక్తి జీవితం మొత్తాన్ని అంటే చిన్నతనం నుండి ప్రతి సన్నివేశాన్ని అతనికి చూపిస్తూన్నాడు. ప్రతి సన్నివేశంలో రెండు జతల అడుగుజాడలు కనబడుతున్నాయి. ఒక జత అడుగుజాడలు తనవిగా గుర్తించి మరొక జత అడుగుజాడలు ఎవరివై ఉంటాయని ఆలోచిస్తుండంగా ప్రభువు ఆ రెండో జత అడుగు జాడలు నావే. నువ్వు నా మీద ఆధారపడ్డావు కాబట్టి నేను నీతో కూడ ఉన్నాను అన్నాడు. అప్పుడు ఆ వ్యక్తి చాలా సంబర పడిపోయాడు. అలా దేవుడు ఆ వ్యక్తి జీవితంలో ఆనందకరమైన చాలా సన్నివేశాలు చూపించాడు. ఆ తరువాత అతను ఎదుర్కొన్న కష్టాలు, శ్రమలు చూపించ సాగాడు. ఆ కష్టాలు చూడగానే అతని హృదయమంతా బాధతో, వేదనతో నిండి పోయింది. కొంతసేపటికి తేరుకొని చూసేసరికి తన శ్రమల సన్నివేశాలన్నిటిలో ఒక్క జత అడుగు జాడలే కనిపించాయి. అంటే నా శ్రమలలో దేవుడు తనను విడిచిపెట్టేశాడు అందుకే తనకు శ్రమలు కలిగాయి అనుకున్నాడు. మనసంతా బాధతో నిండిపోయింది. నేను దేవునిపై ఆధారపడి బ్రతుకుతున్నాను కదా దేవుడు నాకెందుకు సహాయం చేయలేదు? అని కోపం వచ్చింది. వెంటనే యేసయ్యను అడిగేశాడు నా శ్రమలలో నాతో నీవెందుకు లేవు? నా ఒక్కడి అడుగుజాడలే ఎందుకు ఉన్నాయి? అని. అప్పుడు యేసయ్య చిన్నగా నవ్వి ఆ అడుగు జాడలు నీవి కావు, అవి నావి. నీ శ్రమలలో నేను నిన్ను ఎత్తుకొని నడిచాను. అందుకే నా ఒక్కడి అడుగు జాడలే కనిపిస్తున్నాయి అన్నాడు యేసయ్య. దేవుని అచంచలమైన ప్రేమను ఊహించడం అసాధ్యం.

శ్రమలు కలిగితే అప్పటి వరకు దేవునిపై ఉన్న మన విశ్వాసం, నమ్మిక అన్ని పోయి ఆ స్థానంలో దేవుని పై కోపం, అపనమ్మకం కలుగుతాయి దేవుడు ఎందుకు ఇలాంటి పరిస్థితిని అనుమతించాడని ఆయనను నిందిస్తామే తప్ప శ్రమలలో మనల్ని ఎత్తుకొని నడిచేవాడు, ఎలాంటి పరిస్థితినైన చక్కజేయగలిగేవాడు, ఏ స్థితికైన చాలిన దేవుడు మనతో ఉన్నాడు అని గ్రహించము. అందుకే కంగారు పడతాము. దేవుడు మరణము వరకు మనలను నడిపించేవాడు అని బైబిల్ సెలవిస్తుంది.

*"ముదిమి వచ్చు వరకు నిన్ను ఎత్తుకొనువాడను నేనే తలవెంట్రుకలు నెరయు వరకు నిన్ను ఎత్తుకొనువాడను నేనే, నేనే చేసియున్నాను చంకపెట్టుకొనువాడను నేనే, నిన్ను ఎత్తుకొనుచు రక్షించువాడను నేనే" - యెషయా 46:4*

*"చూడుము నా యరచేతుల మీదనే నిన్ను చెక్కి యున్నాను" - యెషయా 49:16*

ఆయనే మనల్ని ఎత్తుకొని నడుస్తాను అంటున్నాడు. ఇక మనకి చింత ఎందుకు? ఎటువంటి శ్రమ ఎదురైనా ఆయన మనలను విడువక మనలను ఎత్తుకొని నడిచే గొప్ప దేవున్ని కలిగి ఉన్నందున నిబ్బరము కలిగి ఆయనలో ఆనందించాలి.

సాక్ష్యము

# సువార్తికుడిగా మారిన కమ్యూనిస్టు

మా తాత గారి పేరు కలపాల అబ్రాహాము. అవ్వ శారా. మా తండ్రిగారి పేరు ఇస్సాకు, తల్లి సంతోషమ్మ. నేను, ఇద్దరు అక్కలు సంతానం. నాకు మా తాతగారి పేరు అబ్రాహాము అని పేరు పెట్టారు. గుణదలలో మేము నివశించే ప్రాంత స్థాపకులు మా పితరులు అందువలన మా వీధిని కలపాల వీధి అంటారు. మా తండ్రి గ్రామ పంచాయితీలో పనిచేస్తూ వ్యవసాయం చేసేవారు.

నన్ను సి.యస్.ఐ. ఎలిమెంటరీ స్కూలులో చేర్చారు. హైస్కూలు గుణదల సీయోను పాఠశాల. చదువు అబ్బలేదు. మధ్యలో ఆపివేశాను. అప్పటి నుండి వీధిలోని పెద్దలతో తిరగటం వారితో కూర్చోని పిచ్చాపాటి మాట్లాడ టం అలవాట య్యింది. అలాగే కమ్యూనిష్టు సిద్ధాంతాలకి లోబడిపోయాను. అలా నాకు 18 సం॥ల వయస్సు వచ్చేసరికి పేరు మోసిన రౌడి షీటరునయ్యాను. నారాయ ణ, సత్యం, చెరుకూరి, నా జతగాళ్ళు. కొట్లాటలు గలాటాలు ముమ్మురంగా జరిపేవాడిని.

రక్తం చిందించకుండా ప్రభువు నన్ను ఆరోజుల్లో కాపాడాడని నమ్ముతున్నాను. చాలా తెలివిగా ఉండి పోలీసులకు దొరకలేదు. నా వెంట నాలాంటి వారు ఏడుగురయినా తిరిగేవారు. మారణాయుధాలు గండ్ర గొడ్డళ్ళు బరిశెలు అందుబాటులో ఉంచుకొనేవాళ్ళం. వాటిని తయారు చేసి, అవసరమన వాళ్ళకి సరఫరా చేసేవాడిని.

ఇంట్లో మా తల్లిదండ్రులకు తెలియకుండా వాటిని గోడ లోపల దాచేవాడిని. చివరికి నేనేమయిపోతానో అని మా తల్లిదండ్రులు నిత్యం దుఃఖిస్తుండే వారు. నేను చచ్చిపోతే ఇంట్లో దీపం పెట్టెవారు ఉండరని, నాజీవితాన్ని మార్చుకోమని మా తల్లిదండ్రులు నన్ను ఏడుస్తూ ప్రాధేయపడేవారు. ఒక వేళ పెండ్లి చేస్తే నేను మారతాననే ఆశతో నా 18వ సం॥లోనే గుంటూరు జిల్లా నారా కోడూరు వాస్తవ్యులు సందేటి రాజారావు, ఆగ్నేసమ్మల రెండవ కుమార్తె నిర్మలకుమారితో 25 జులై 1974 లో గుణదలలో వివాహము జరిపించారు. అయినా నా జీవిత విధానంలో ఏ మార్పు రాలేదు. ఇలా ఉన్నప్పటికీ త్రాగుడు పేకాట అలవాటు కాలేదు. నాతోటి వారందరు త్రాగేవారు దొంగ సొత్తు విషయం దొంగతనానికి దూరంగా ఉండేవాడిని. నాకు వినయకుమార్, సుధారాణి అనే ఇద్దరు పిల్లలు కలిగారు.

నా భార్య మూడవ కాన్పుకు సిద్ధమవుచుండగా ఒకరోజు నేను ఇంట్లో భోజనం చేస్తుండగా బయట పిచ్చికుక్క వచ్చిందని విన్నాను అది లోపలికి వస్తుందేమోనని గోడలో దాచిన బరిసెను వాకిటివైపు విసిరాను అదే సమయములో ప్రక్కన బాత్‌రూంలో నుండి బయటకు వస్తున్న నా భార్య తోడలోనికి ఆ బరిసె దూరి బయటకు వచ్చింది. అమ్మో గుచ్చుకొంది అని అరచి నా భార్య పడిపోయింది. నేను బయటికి పరుగెత్తి వస్తే అంతా రక్తం మడగు అయింది. టవలు పెట్టినా రక్తం ఆగలేదు. నా బనియను రక్తంతో తడచిపోయింది. చుట్టుప్రక్కలు ఇళ్ళలోని వారు అందరూ చూస్తున్నారు కాని నా పొగరుబోతు ప్రవర్తన నెరిగి ఉన్నవారు కనుక ఎవరు దగ్గరకు రాలేదు. నా కుమారుడు కుమార్తె కూడ నన్ను చూసి భయపడి దగ్గరకు రాకుండా ఏడుస్తున్నారు. పెద్దగా ఏడిస్తే మమ్ముల్ని కూడ చంపుతాడేమో అనుకున్నారు. నేను ఆ బరిసెను నాభార్య మీదకి కోపంతో విసిరానని అందరు అనుకున్నారు.

నా భార్య సొమ్మసిల్లిపోతూ ''అయ్యో నేను చనిపోతానేమో అని అన్నది అయిదు నిమిషాలలో శరీరం నీలంరంగులోకి మారిపోయింది. అప్పుడు నేనే తెగించి సెంటర్‌కి వెళ్లి రిక్షాని పిలుచుకొని రాబోయాను. నేను అటువెళ్ళగానే చుట్టుప్రక్కల వాళ్లు అందరూ నాభార్య దగ్గరకు వచ్చారు. అందరూ నన్ను నానారకాలుగా దుర్భాషలాడటం ప్రారంభించారు. నా తల్లి దండ్రులు కూడా నేనే నా భార్యను పొడిచానని నమ్మారు.

రిక్షాలో నా భార్యను డాక్టరు సమరంగారి ఆస్పత్రికి

తీసికొని వెళ్ళాను. ఇది మర్డరు కేసు కనుక గవర్నమెంటు ఆస్పత్రికి తీసికొని వెళ్ళమన్నారు. కాని అక్కడ నిరీక్షణ అనే నర్సు డాక్టరు గారికి నచ్చచెప్పి ట్రీట్మెంటు ఇప్పించింది. పది కుట్లు వేశారు. అడ్మిట్ చేసికొని 36 గంటలు దాటితే కాని చెప్పలేమన్నారు. చాలా రక్తము కొని ఎక్కించారు. ఆమె బ్రతికింది. నా భార్య పుట్టింటివారు వచ్చి మా పిల్లను మేము తీసికొని వెళ్తాము, నీ పిల్లల్ని నువ్వు తీసికో అని నా భార్యను తీసికొని వెళ్ళబోయారు. ఎవడ్రా నా భార్యని తీసికొని వెళ్ళేది అని బరిసె తీసికొని వచ్చాను. అప్పుడు వాళ్ళు భయంతో అది- చచ్చింది అనుకొంటాము అని పారిపోయారు. రక్తం చూసి కూడ నా జీవితంలో మార్పు రాలేదు. తర్వాత సలోమి, ఐజక్ అని ఇద్దరు పిల్లలు నాకు జన్మించారు.

కమ్యూనిష్టులకి కులం, మతం లేదు. అయినా అక్కడ కమ్యూనిష్టులలో అగ్రకులాల వాళ్ళు మిగతా వారిని హీనంగా చూచేవారు అందువలన నేను అగ్రకులస్తులను తీవ్రంగా ఎదిరించేవాడిని, దాంతో వాళ్ళు నన్ను చంప టమో లేక రెండు కాళ్ళు విరగదియ్యటమో చేయాలను కున్నారు

1981 లో గుణదల గ్రామ ప్రెసిడెంటు కమ్యూనిటీ వాటర్ స్కీమ్లో ఫిల్టరు చెక్ ఆపరేటరుగా పది పైసలయినా లంచం తీసికోకుండా ఉద్యోగం ఇచ్చారు. అక్టోబరు 31న ఉద్యోగంలో చేరాను. గుణదలలోని జాన్ విల్లియమ్స్గారు సువార్త సభలు పెట్టించారు. ఇప్పుడు దేవినగర్లో గ్రేస్ గ్రాఫిక్స్ నడిపిస్తున్న ఇందుపల్లి శ్యామ్బాబు (నా మేనల్లు డు) ప్రభువును తన స్వరక్షకునిగా అంగీకరించి మరి కొందరు ప్రభువు బిడ్డలతో నా రక్షణ కొరకు ప్రార్థించ సాగారు. 1982న సి. విజయబాబు కాకినాడ నుండి మీటింగులకు వచ్చారు. ఆయన వాక్యము వినటానికి రమ్మని శ్యామ్బాబు నా చేతులు పట్టుకొని బ్రతిమిలాడాడు. 1982 మార్చి 11వ తారీఖున మీటింగ్కి వెళ్ళి కూర్చు న్నాను. విజయబాబుగారు "దేవుడైన యెహోవా ఆదాముతో నీవెక్కడ ఉన్నావని" పిలిచినట్లు చెప్తూ కడపటి ఆదామయిన యేసుప్రభువు పునరుత్థానుడైన సంగతి చెప్పుచుండగా ఆ వాక్యము నా హృదయములో గుచ్చబడింది. నాకు తెలియకుండానే ఆ సభలోనే ఏడుస్తున్నాను సభ అయిపోయిన తర్వాత దైవజనుడు నాయొద్దకు వచ్చి నన్ను పలకరించి ప్రార్థన చేసాడు. దేవుని శక్తి నన్ను లాగింది. ఇక నుండి ప్రభువును వెంబడించు అని చెప్పి ఆయన వెళ్ళిపోయాడు.

ఆ పశ్చాత్తాపము నన్ను విడువలేదు. ఆ రాత్రి నైట్ డ్యూటికి వెళ్లవలసి ఉండగా ఇంటికి వచ్చేసాను. పోలీసులకు దొరకకుండా దాచిపెట్టిన ఆయుధములను గొతాములో కట్టాను. పార్టీ ఆఫీసుకు వెళ్ళి పార్టీకి రిజైన్ చేసిన ఉత్తరం ఇచ్చి ఇద్దరు కార్యకర్తలను వెంటబెట్టుకొని ఇంటికి వచ్చి నాకు ఆయుధాలు ఎవరిచ్చారో వారికి ఇచ్చి వేశాను.

తెల్లవారి ప్రొద్దున బీరువాలో ఉన్న పుస్తకాలు కర పత్రికలు మొత్తం కాల్చివేశాను. అవి నా జీవితాన్ని నాశనం చేశాయి. 1983 లో బైబిలు మొత్తం మోకాళ్ళ మీద ఉండి చదవాలని తలంపు కలిగి ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు మోకాళ్ళ మీద చదివాను. తర్వాత 10 సార్లు బైబిలు మొత్తం చదివాను.

అప్పుడు పాత అలవాట్లలన్నీ ప్రభువు తొలగించాడు. కొందరు సభలు పెట్టి వాక్యము చెప్పటానికి నన్ను తీసికొని వెళ్ళేవారు. పొలాలకు వెళ్ళి గంటలు గంటలు ఏకాంత ప్రార్థనలో గడిపేవాడిని. గుణదల కొండ మీదకి వెళ్ళి ప్రార్థించేవాడిని. సైకిల్ త్రొక్కేటప్పుడుగానీ, ఏ పని చేస్తున్నా గానీ ప్రార్థిస్తూ ఉండే వాడిని. సంపూర్ణ సేవలో ప్రవేశించిన తర్వాత ఇప్పటికి ఆంధ్రప్రదేశ్ లో 1700 గ్రామాలలో సువార్త ప్రకటించాను. కర్ణాటక రాష్ట్రంలో కూడ ప్రభువు వాక్యము ప్రకటించాను.

లక్షలు నాకు లేకపోయనా కానీ, నాకు 'లేమి' లేదు. 4,000 మందికి పైగా నా ద్వారా బాప్తిస్మము పొందారు.

ఇదే విధంగా జీవితాంతము అనేక గ్రామాల్లో పట్టణాలలో రాష్ట్రాలు తిరిగి సువార్త ప్రకటిస్తూ అనేక మందిని ప్రభువు చెంతకు నడిపిస్తూ అనేక సంఘాలను ఆధ్యాత్మికముగా బలపరుస్తూ జీవితం ముగించాలని ఆశ కలిగి ఉన్నాను. నా కొరకు ప్రార్థించండి.

# విశ్వాసం

ప్రతి క్రైస్తవున్ని చాలా సర్వ సాధారణంగా **'విశ్వాసి'** అని చెప్తుంటారు. కాని అసలు విశ్వాసం అంటే ఏమిటి అంటే చెప్పగలిగే వాళ్ళు, చెప్పిన దాని ప్రకారం జీవించే వాళ్ళే నిజ క్రైస్తవ విశ్వాసులు. విశ్వాసం అంటే ఏమిటో ఒక యథార్థ సంఘటన ద్వారా తెలుసుకుందాం!

ఒక యవ్వనస్థుడు రెండు కొండల మధ్య ఒక తాడు కట్టి ఆ తాడుపై నడిచి, ఆ కొండల మధ్యన ఉన్న లోయను దాటుతాను అని ప్రకటించాడు. ఏ మాత్రం కాలు జారిన శవం కూడా దొరికే అవకాశం లేనటువంటి లోతైన లోయ. అయితే ఆ యవ్వనస్థుడు చాలా ధైర్యంగా తాడుపై నడవడం ప్రారంభించాడు. అందరూ ఉత్కంఠంగా చూస్తున్నారు. ఆ కుర్రాడు చాలా సునాయాసంగా త్రాడుపై నడిచి లోయను దాటాడు. అందరి ముఖాలలో సంతోషం, ఆ సన్నివేశం చూసిన వారందరూ ఆనందంతో కేకలు వేశారు. ఇంతలో ఆ యవ్వనస్థుడు, ఆనందంతో కేరింతలు వేస్తున్న వారిని రెండు ప్రశ్నలు అడిగాడు. మొదటిది "నేను ఈ తాడుపై నడుస్తూ మరల ఈ వైపునుండి ఆ వైపుకు క్షేమంగా వెళ్ళగలనని మీరు నమ్ముతున్నారా?" అని అడిగాడు. అక్కడి జనులు "నమ్ముతున్నాం" అని గట్టిగా కేకలు వేశారు. అప్పుడా యవ్వనస్థుడు రెండో ప్రశ్న వేశాడు. "నన్ను నమ్మితే ఎవరైనా ఒకరు రండి నేను వారిని క్షేమంగా లోయ ఈ వైపు నుండి ఆ వైపుకు తీసుకెళ్తాను" అన్నాడు. అంతా నిశబ్ధం. ఏ ఒక్కరు ముందుకు రాలేదు, కనీసం అలికిడి కూడా లేదు. అయితే ఒక చిన్న బాబు ముందుకు వచ్చాడు, ఆ యవ్వనస్తుడు బాబును ఎత్తుకొని ముద్దాడి తన భుజాలపై కూర్చోపెట్టుకొని రెండవసారి తాడుపై నడిచి లోయను దాటాడు. అందరూ ఆశ్చర్యపోయారు. కొంతమంది "బాబు నీకు భయం వేయలేదా?" అని పిల్లవాడిని అడిగారు. అప్పుడా పిల్లవాడు "ఎందుకు భయం నేను చాలాసార్లు మా నాన్న భుజాలు ఎక్కాను. మా నాన్న నన్ను జాగ్రత్తగా గమ్యం చేరుస్తారని నాకు తెలుసు" అన్నాడు. అప్పుడు అర్ధమైంది ఈ బాబు ఆ యవ్వనస్తుని కుమారుడని.

త్రాడుపై యవ్వనస్థుడు నడిచినప్పుడు క్రింద ఉన్నవారందరూ చూశారు కాబట్టి అతడు ఆ లోయను దాటగలడు అని నమ్మారు. అయితే తనతో ప్రయాణించ డానికి ఆహ్వానించినప్పుడు ఒక్కరు కూడా ముందుకు రాలేదు అంటే ఆ యవ్వనస్థున్ని ఎవ్వరూ విశ్వసించలేదు. చూడటం ద్వారా కలిగేది కేవలం నమ్మకం మాత్రమే. వ్యక్తిగతమైన సంబంధం వలన కలిగే నమ్మకం విశ్వాసంగా మారుతుంది. ఆ యవ్వనస్తుని శక్తి సామర్థ్యాల గురించి నిలబడి చూస్తున్న వారికి తెలియదు కాబట్టి అతనిని విశ్వసించలేదు. అందుకే అతనితో కలసి ప్రయాణించుటకు ఎవరూ సాహసించలేదు. అయితే తన తండ్రితో ఉన్న అనుబంధాన్నిబట్టి ప్రతిదినం తండ్రితో గడిపే సమయాన్ని బట్టి కొడుకుకి మాత్రమే తండ్రిపై అచంచలమైన విశ్వాసం ఉంది.

మనం కూడా అటువంటి అచంచలమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలి.. ప్రతి ఒక్కరు దేవున్ని నమ్ముతారు. అయితే దేవున్ని వ్యక్తిగతంగా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే మనకున్న నమ్మకం విశ్వాసంగా మారుతుంది. క్రమమైన ప్రయత్నం, కార్యాచరణనుబట్టి విశ్వాసం బలపడుతుంది, కదిలింపబడని విశ్వాసంగా మారుతుంది. ఎప్పుడైతే అటువంటి అచంచలమైన విశ్వాసం కలిగి ఉంటావో అప్పుడు నీవు దేవునితో కలిసి నడుస్తావు సాహసకార్యాలు చేయగలుగుతావు నీవు ఒక విశ్వాస వీరుడవు/ వీరురాలివై చరిత్ర పుటల్లో నిలబతావు.

***"విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడ నియు, తన్ను వెదకు వారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా" హెబ్రీ. 4:11***

# నాకే ఎందుకిలా.....?

మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భములో నాకే ఎందుకు ఇన్ని కష్టాలు? నాకే ఎందుకిలా జరుగుతుంది? ఇంత శ్రమ అనుభవించడానికి నేనేమి చేశాను? అని అనుకొని ఉంటారు. తమ ప్రమేయం లేకుండా శ్రమ అనుభవించినప్పుడు, అమితంగా నష్టపోయినప్పుడు లేదా ఇబ్బందికర పరిస్థితుల ద్వారా వెళ్ళవలసి వచ్చినప్పుడు దేవున్ని ప్రశ్నిస్తుంటాం. అయితే ఎటువంటి పరిస్థితి అయినా, ఆ పరిస్థితికి కారణం ఎవరైనా దేవున్ని నిందించడం ఒక విశ్వాసి లక్షణం కాదు. అలా నిందిస్తున్నాము అంటే మనం విశ్వాసులము కాదనే అర్థం విపత్కరమైన పరిస్థితులలో విశ్వాసాన్ని కలిగి ఉండాలి అంటే ఆ పరిస్థితిని చూసే దృష్టికోణం మారాలి.

టెన్నిస్ ప్రపంచంలో 'ఆర్థర్ ఆషే' పేరుకు ఒక చరిత్ర ఉంది. న్యూయార్క్ సిటిలో ఆర్థర్ ఆషే పేరు మీద ఒక స్టేడియం ఉంది అంటే ఆయన ఎంత పేరు ప్రఖ్యాతులు సంపాదించాడో, ఎన్ని కోట్ల మంది అభిమానాన్ని చూరగొన్నాడో అర్థమౌతుంది. ఆర్థర్ అమెరికా తరుపున టెన్నిస్ ఆడి విజేతగా నిలిచిన తొలి నల్లజాతీయుడు. ఆర్థర్ టెన్నిస్ ఆటలో ఎన్నో విజయాలు సాధించాడు. 1960వ దశకంలో యు.యస్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్ వంటి చాంపియన్‌షిప్స్ గెలుచుకొని విజేతగా నిలిచాడు. రికార్డులు నెలకొల్పాడు. 1980లో అతనికి జరిగిన గుండె ఆపరేషన్‌లో పొరపాటున హెచ్.ఐ.వి ఉన్న రక్తాన్ని ఎక్కించడంతో ఆర్థర్‌కి ఎయిడ్స్ అనే ప్రాణాంతకమైన వ్యాధి వచ్చింది.

ఈ వార్త తెలిసిన ఒక అభిమాని "మీకే ఎందుకు ఇలా జరగాలి? మీకు జరిగిన దానిని బట్టి నాకు దేవుని పై చాలా కోపంగా ఉంది సార్" నాకే ఎందుకిలా జరిగింది ప్రభువా అని మీరు దేవున్ని అడగలేదా? అని ఆర్థర్‌ని ప్రశ్నించిందట. అప్పుడు ఆర్థర్ నవ్వుతూ ప్రతి ఏడాది

50000000 మంది టెన్నిస్ ఆడాలి అనుకుంటారు అందులో

5000000 మంది టెన్నిస్ ఆడటం నేర్చుకుంటారు అందులో

500000 మంది నైపుణ్యం కలిగి టెన్నిస్ ఆడగలిగేవారుంటారు అందులో

50000 మంది టెన్నిస్ కోర్టుకు వస్తారు. అందులో

5000 మంది గ్రాండ్‌స్లమ్ పోటీలకు వస్తారు. అందులో

50 మంది వింబుల్డన్‌కు వస్తారు. అందులో

నలుగురు మాత్రమే సెమీఫైనల్స్‌కి చేరుకుంటారు. అందులో

ఇద్దరు మాత్రమే ఫైనల్స్‌కి చేరుకుంటారు. వారిలో

ఒక్కరు మాత్రమే విజేతగా నిలుస్తారు. అన్ని కోట్ల మందిలో దేవుడు నన్ను విజేతగా నిలబెట్టినప్పుడు ఇంతమందిలో నాకే ఇంత ఉన్నతమైన స్థానాన్ని ఎందుకు ఇచ్చావు ప్రభువా? అని నేను ఎప్పుడూ అడగలేదు. మరి ఇప్పుడు ఈ పరిస్థితి నాకే ఎందుకు ఇచ్చావు ప్రభువా? అని నేను దేవున్ని ఎలా అడుగగలను? నా పట్ల దేవుని చిత్తం ఇదేనేమో అని సమాధానం ఇచ్చాడట.

1993లో 50 సంవత్సరముల వయస్సులో చనిపోయాడు ఆర్థర్ ఆషే.

ఆర్థర్‌వలె మన జీవితాల్లోని విపత్కర పరిస్థితులను దేవుని చేతికి అప్పగించి ఎవరిని నిందించక నెమ్మదిగా నిమ్మళంగా ఉంటూ దేవుని నామానికి ఘనతను తెచ్చేవారిగా మన విశ్వాస జీవితాన్ని కొనసాగిద్దాం.

చిన్నపిల్లల పేజి

# ప్రత్యేకత

కేరీ స్కూల్ టైం అవుతుంది ఇంకా లేవలేదా? అనే తల్లి అరుపుతో ముఖం పై నుండి దుప్పటి తొలగించి లేచి అయిష్టంగా స్కూల్‌కి రెడీ అయ్యాడు కేరీ. స్కూల్ బస్ మిస్ చేయడమే ధ్యేయంగా నెమ్మదిగా టిఫిన్ తింటున్న కేరీతో తల్లి ఏమైంది కేరీ, త్వరగా తిను, స్కూల్ బస్ వచ్చేస్తుంది, స్కూల్‌కి వెళ్ళాలి కదా అంది కేరీ తల నిమురుతూ. లేదు మమ్మీ, నాకు స్కూల్‌కు వెళ్ళాలని లేదు, ఈ రోజే కాదు కుదిరితే ఎప్పటికి నేను స్కూల్‌కి వెళ్ళను అన్నాడు కేరీ. ఏమైంది కేరీ, స్కూల్ నచ్చలేదా? క్రొత్తలో అలానే ఉంటుంది. స్నేహితులు ఏర్పడితే అన్ని సర్దుకుంటాయి అంది నవ్వుతూ. బస్‌స్టాప్ దగ్గర నిలుచున్నది మన పొరుగింటి టైటస్ కదూ అంది కిటికిలో నుండి రోడ్డు మీదకు చూస్తూ. తల్లి ఇంకా మాట్లాడుతూ ఉండగనే కేరీ వెళ్ళిపోయాడు.

బస్ స్టాప్ వద్దకు నడుస్తున్న కేరీకి 'లక్కీగా మన పొరుగింటి టైటస్ నీ క్లాస్‌మేట్ అయితే నీకు స్కూల్‌కి వెళ్ళడం ఇష్టంగా మారుతుంది' అనిన తల్లి మాటలు గుర్తుకు రాసాగాయి. టైటస్ నా క్లాస్ ఆ.... బాబోయ్ ఆ ఊహే చాలా భయంకరంగా ఉంది కేరీకి. తండ్రి ట్రాన్స్‌ఫర్ వలన క్రొత్తగా వచ్చిన కేరీని టైటస్ వెక్కిరించేవాడు. అందుకే కేరీకి టైటస్ అంటే అస్సలు నచ్చేది కాదు. అలాంటి టైటస్ తన క్లాస్‌లో ఉంటే.. వద్దు దేవుడా టైటస్ నా క్లాస్‌మేట్ కాకూడదు అంటూ ప్రార్థించుకుంటుండగా స్కూల్ బస్ వచ్చింది. కేరీ బస్ ఎక్కగానే అందరూ కేరీని వింతగా చూడసాగారు. ఇంతలో టైటస్ కేరీని, రేయ్ మచ్చల ముఖం వాడా అని పిలిచాడు. కేరీకి పిచ్చ కోపం వచ్చింది టైటస్‌కి గట్టి వార్నింగ్ ఇద్దామనే లోపే బస్‌లోని పిల్లలందరూ కేరీని మచ్చల ముఖం వాడు అంటూ ఎగతాళిగా పిలవ సాగారు. కేరీ కోపంతో అరిచిన ఎవ్వరూ అతని అరుపులు పట్టించు కోకుండా కేరీని ఎక్కిరిస్తూ నవ్వుతున్నారు. కేరీకి విపరీతమైన కోపం, చిరాకు ఒంటరితనం కలిగాయి.

బస్‌లోని పిల్లలందరూ దిగిన తరువాత కేరీ ఒంటరిగా తన తరగతి గది వైపు నడిచాడు. గదిలో అడుగుపెట్టడంతోనే కేరీ గుండె రెండింతలు వేగంగా కొట్టుకోసాగింది. ముందుబెంచీలో టైటస్ కూర్చుని ఉన్నాడు. మెల్లగా వెళ్ళి వెనుక బెంచీలో కూర్చున్నాడు కేరీ. టైటస్ కారణంగా కేరీ ఎవ్వరితోనూ స్నేహం చేయలేకపోయాడు. పైగా అందరూ తన ముఖంపై మచ్చలు ఉన్న కారణంగా తనను విచిత్రంగా చూస్తు, ఎగతాళిగా మాట్లాడేవారే తప్ప తనతో స్నేహం చేయాలనుకునే వారు ఎవరూ లేరు. కేరీ పూర్తిగా ఒంటరివాడైపోయాడు. చదువులోను వెనకబడిపోయాడు. ఎవరితోను మాట్లాడేవాడు కాదు. అలానే ఒక సంవత్సరం గడిచింది.

క్రొత్త తరగతిలోకి ప్రవేశించడంతో పిల్లలందరూ సంతోషంగా ఉత్సా హంగా ఉన్నారు ఒక్క కేరీ తప్ప. తరగతి గది మారిందే తప్ప కేరీ జీవితంలో ఏ మార్పూ లేదు. అవే హేళన మాటలు, ఎక్కిరింపులు ఒంటరితనం. ఒకరోజు ఒంటరిగా లంచ్‌చేస్తున్న కేరీ ప్రక్కన ఎవరో కూర్చున్నట్లు అనిపించి తలెత్తి చూశాడు కేరీ. ఆమె తన క్లాస్‌టీచర్ మేరి. ఆమె నవ్వుతూ కేరీని పలకరించింది. కేరీ చిన్నగా నవ్వి తల వంచుకొన్నాడు. అప్పుడామే, కేరీ తలను పైకెత్తి, నువ్వు అందరికంటే చాలా వేరుగా ఉన్నావని బాధపడు తున్నావా? అన్నది. ఏం మాట్లాడలేదు కేరీ. ఇంతమందిలో దేవుడు నిన్ను ఇంత వేరుగా ఎందుకు పుట్టించాడో ఎప్పుడైనా ఆలోచించావా? అన్నది. టీచర్ ప్రశ్న విని తలపైకెత్తినా, జవాబు లేక మౌనంగా ఉన్నాడు కేరీ. టీచర్ నవ్వుతూ, ఎందుకంటే దేవునికి నువ్వు చాలా ప్రత్యేకమైన వాడివి అందుకే దేవుడు నిన్ను అందరికంటే వేరుగా పుట్టించాడు. ఈ సంగతి నీకు తెలియనట్టే నీ ఫ్రెండ్స్‌కి తెలియదు. అందుకే వారు నిన్నిలా వెక్కిరిస్తున్నారు అన్నది. కేరీ మఖంలో చిన్న చిరునవ్వు విరిసింది. దేవుని ప్రేమను ఇతరులకు తెలియచేయటానికే దేవుడు కొంత మంది ప్రత్యేకమైన వారిని

దేవుడు సృష్టిస్తాడు. మా అందరి కంటే దేవుడు నిన్ను ఎక్కువ ప్రేమిస్తున్నందులకు నువ్వు అందరికంటే ఎక్కువ సంతోషంగా ఉండాలి . నీ ఫ్రెండ్స్ మాటలు పట్టించుకోకు. నీ ముఖంపై ఉన్న మచ్చలను బట్టి బాధపడక నువ్వు దేవునికి ప్రత్యేకమైన వాడివైనందుకు కృతజ్ఞత కల్గి ఆయనకు ఇష్టమైన బిడ్డగా జీవించాలి అన్నది.

ఆ మాటలు కేరీకి ఎంతో సంతోషాన్ని కలిగించాయి. ఆ రోజు నుండి కేరీ సంతోషంగా ఉండసాగాడు. టైటస్ తనను ఎక్కిరించినా ఏ మాత్రం చిరాకు పడక నవ్వుతూ బదులిచ్చి వారితో స్నేహంగా ఉండడానికి ప్రయత్నించసాగాడు. దాంతో చదువుపై ఏకాగ్రత పెరగడం, క్లాస్‌లో అందరికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవడంతో టీచర్లందరూ కేరీని పొగడసాగారు. కేరీలోని మార్పుకు, టైటస్ ఆశ్చర్యపోవడమే కాక ఏమి చేసినను కేరీని ఏడ్పించలేమని తెలుసుకొని తన ప్రవర్తన మార్చుకున్నాడు. కేరీ తన జీవితాన్ని మార్చి, తనకు సంతోషాన్ని ఇచ్చిన దేవునికి జీవితాంతం కృతజ్ఞతతో జీవించాలని నిర్ణయించుకున్నాడు.

**21వ పేజీ తరువాయి....**

తను కూడా యేసయ్యను నమ్ముకుంది. కాని ఇంట్లో ఉండే ఒత్తిడి అశాంతి కారణంగా తను కూడా రహస్య క్రైస్తవు రాలిగానే ఉంది. నేను యేసయ్యని గూర్చి తెలుసుకోక ముందు ఇతరులు నా ఎదుట ఎంత బాధపడుతున్నా నాకు కనీసం చీమకుట్టినట్టుగా కూడా ఉండేది కాదు. చాలా కఠిన హృదయం నాది. యేసయ్యను నమ్ముకున్న తర్వాత నేను పూర్తిగా మారిపోయాను. దేవుని ప్రేమతో నింప బడ్డాను. ఇప్పుడు నేను పదిమందికి దేవుని ప్రేమ పంచగ లను. దేవుడిచ్చే శాంతి, ప్రేమ, సంతోషం ముందు నేను ఎదుర్కోనే సమస్యలు ఏవీ పెద్దవి కావు. ఎటువంటి కష్టమైన స్థితిలోనైనా ఆయనను విడువకుండా ఉండునట్టి బలమైన విశ్వాసం దేవుడు నాకు ఇచ్చాడు. దేవుడు నాకు నా కుటుంబ విషయంలో వాగ్దానం చేశాడు (యిర్మియా 31:16). కాలేజీలోను, హాస్టల్లోనూ అయన మహిమార్థం నన్ను వాడుకున్నాడు. నా కష్టాల్లో, సమస్యలలో, బాధలలో నేను ఎప్పుడూ వదల్లేదు. నా కొరకు ప్రార్థించండి.

**11వ పేజీ తరువాయి....**

చాడీలు చెప్పడం చేస్తూవుంటారు. కాని సంపూర్తి గ దేవునికి అప్పగించి సహనంతో ఎదురుచూడడం ఎంత అవసరమో అబీగయీలును చూచి తెలుసుకోవలసివున్నది. మనలను పరీక్షించడానికే దేవుడు అటువంటి పరిస్థితులు కలిగించవచ్చునేమో కదా! **నశించిపోవు సువర్ణము అగ్ని పరీక్షవలన శుద్ధ పరచబడుచున్నది కదా! (1పేతురు 1:7)**

నాబాలు చనిపోయిన తరువాత దావీదు అబీగయీలును ఒంటరిగా వుండనివ్వలేదు. ఆమెలో ఉన్న శాంతము, సహనము, వినయము, విధేయత, జ్ఞానము, వివేకము, ముఖ్యంగా దేవునియందలి భయము, భక్తి దావీదును బాగా ఆకర్షించాయి. తన జీవితంలో ఆమె సహాయము, సహకారము చాలా అవసరం అని తెలుసుకున్నాడు. అందుకే తన దాసులను ఆమె యొద్దకుపంపి తనను వివాహం చేసుకోవలసిందిగా అర్థించమని పంపాడు. ఇంతకుముందు తన ప్రాణాలు కాపాడుమని అర్థించడానికి అబీగయీలు దావీదు వద్దకు వెళ్ళింది. కాని ఇప్పుడు దావీదే ఆమెను అర్థించే స్థితికి వచ్చాడు. ఇదంతా ఆమె మంచి గుణగణాల వలనే అని మనకు అర్థమవుతుంది. అయినా దావీదు ఆమెను అర్థించడానికి ఆమె యొద్దకు మనుష్యులను పంపినపుడు ఏ మాత్రము గర్వించక బహు వినయముతో “నా ఏలినవాని చిత్తము, నా యేలినవాని కాళ్ళు కడుగుటకు నా యేలినవాని దాసురాలగు నేను సిద్ధముగా ఉన్నాను” అని (1సమూ 25:41) చెప్పి త్వరగా లేచి గార్థభము మీద ఎక్కి దావీదు దగ్గరకు వెళ్ళింది. అతడు ఆమెను వివాహం చేసుకున్నాడు. దావీదుతో కూడ చాలా ప్రదేశాలు తిరిగింది. హెబ్రోనుకు వెళ్ళినపుడు కిల్యాబు అనే కుమారునికి జన్మనిచ్చింది. సౌలు చనిపోయిన తరువాత దావీదు యూదావారి మీద రాజుగా పట్టాభిషేకం పొందాడు. అప్పుడు అబీగయీలు “మహారాణి” అయింది.

**యెహోవా యందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడ బడును. చేసిన పనినిబట్టి అట్టివారికి ప్రతిఫల మియ్య దగును (సామె 31:31)**

# సాక్ష్యము నా ప్రభువును నేను వదల్లేదు

నా పేరు శ్రీ విద్య. నేను హిందూ కుటుంబంలో జన్మించాను. మా తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా ఒంగోలులో ఉంటున్నారు. నాకు ఒక చెల్లెలు ఉంది. నేను మద్రాసులో జె.ఎ. ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం చదివే టప్పుడు నా ప్రభువు నన్ను ఆకర్షించుకున్నాడు.

నేను ఇంటర్మీడియట్ మెదటి సంవత్సరం చదివేటప్పుడు రేడియెలో దేవుని వాక్యం వింటుండేదానను. అప్పటికి నాకు యేసయ్యను గురించిగానీ, క్రైస్తవమతం గురించి గానీ ఏమీ తెలియదు. అయితే రేడియోలో వాక్యం వినేటప్పుడు నాకు యేసును గురించి ఇంకా తెలుసుకొవాలనే కుతూహలం కలిగి నేను క్రైస్తవ్యంలోకి మారవచ్చా? అని క్రైస్తవురాలైన నా క్లాస్‌మేట్‌ని అడిగాను. ఆ అమ్మయి మీ తల్లిదండ్రులకు ఏమీ అభ్యంతరంలేదా? అని అడిగింది. అప్పుడు "నేను వారికి అభ్యంతరమైన సరే నేను మారతాను" అన్నాను. ఆ మాట నా ప్రమేయం లేకుండా అన్నాను. "ఒకవేళ నేను యేసయ్యను నమ్ముకున్నా, హిందూ పూజలు అవీ చేయ వచ్చా?" అని అడిగాను. అప్పుడు ఆ అమ్మాయి "చల్లగా అన్నా వుండు లేదా వెచ్చగా అన్నా ఉండు, నులివెచ్చగా ఉండ వద్దు అని యేసయ్య చెప్పాడు" అని చెప్పింది.

తర్వాత ఇంకెప్పుడూ దాని గురించి ఆలోచించలేదు. మళ్ళీ రేడియోలో వాక్యం వినలేదు. యేసయ్యను గురించి ఆలోచించ లేదు. ఇంటర్మీడియట్ పాసయ్యాక నేను బి.ఐ.టి మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో చేరాను. కానీ ఆ కోర్సుకు విలువలేదని తెలిసి చాలా బాధపడి ఏం చెయ్యాలో తెలియని పరిస్థితిలో ఉనప్పుడు దేవుడు ఒక వ్యక్తి ద్వారా నన్ను ఇంజ నీరింగ్ చదవటానికి మార్గం ఏర్పరచాడు. నేను మద్రాసులో ఏ కాలేజీలోను సీటు దొరకనందున తప్పనిసరి పరిస్థితుల్లోఒక క్రైస్తవ ఇంజనీరింగ్ కాలేజీలో చేరాను. అక్కడ నా స్నేహితు లందరూ క్రైస్తవులే. వారి వల్ల నేను యేసయ్యను గురించి ఎక్కువగా తెలుసుకోగలిగాను. యేసయ్య వారి జీవితాలలో చేసిన ఆశ్చర్యకార్యాలను నాతో పంచుకొన్నప్పుడు నేను చాలా ఆశ్చర్యపోయాను. ముందు నమ్మలేదు, తర్వాత వారిని బాగా పరిశీలించాను. చిన్నఅబద్ధం చెప్పటానికి కూడా వారు వెనుకాడటం ఇతరుల గురించి ప్రార్థించడం, ఇతరులను ప్రేమించడం నన్ను ఆకర్షించాయి. నేను కూడా క్రైస్తవురాలిగా వుండాలని ఆశపడేదానను. తర్వాత వారు అన్యుల గురించి, వారు యేసయ్యను నమ్ముకొన్న తర్వాత వారు ఎదుర్కొన్న సమస్యలు, కష్టాలు, చెప్పేవారు. అలాంటి సమయాల్లో కూడా వారు యేసయ్యను విడువకుండా ఆయన కొరకు అన్నింటిని భరించిన విధం నాతో పంచుకొన్నప్పుడు నేను కూడా అలా ఉండాలని గట్టిగా నిశ్చయించుకొన్నాను. యేసయ్యను నా స్వంత రక్షకునిగా అంగీకరించాను. ప్రతి ఆదివారం నా స్నేహితులతో కలిసి చర్చికి వెళ్తుండేదానను. వారితో కలిసి హాస్టల్లో ప్రార్థింస్తుండేదానను. ఇదంతా మా ఇంట్లో ఎవరికీ తెలియదు.

సెలవులలో నేను ఇంటికి వెళ్ళినప్పుడు మా నాన్న నన్ను అడిగాడు "ఏమ్మా, హనుమాన్ చాలిసా చదువుతున్నావా?" అని. అప్పుడు నేను "చదవడం లేదు" అని చెప్పాను."అయితే వెళ్ళి చదువుకో" అన్నాడు. మా నాన్నకి ఎదురు చెప్పడం ఇష్టం లేక పూజ గదిలోకి వెళ్ళి చదవటానికి ప్రయత్నించాను కాని నేను చదవలేకపోయాను. మానాన్న నా ప్రక్కనే ఉన్నాడు. విగ్రహారాధన చేయకూడదని దేవుడు చెప్పిన విషయం గర్తుకు వచ్చింది. "నేను చదవను నాన్న" అని చెప్పి ప్రక్కకు వచ్చేశాను. చదవమని బ్రతిమలాడాడు. కానీ నేను చదవలేదు. మా నాన్న నాతో మాట్లడటం మానేశాడు నేను వారి ఎదురుగానే యేసయ్యకు ప్రార్థించేదానను. అప్పుడు మా అమ్మ నా దగ్గరకు వచ్చి యేసయ్యను ప్రార్థించ వద్దని ఏడ్చేది. అందరూ దేవుళ్ళే. యేసయ్యను మాత్రమే ప్రార్థించవద్దు" అని చెప్పేది.

మా అమ్మ ఆరు, ఏడు సంవత్సరాల నుండి మానసికమైన రుగ్మతతో బాధపడుతుండేది. మేము ఎన్నో హస్పిటల్స్‌లో చూపించాము. అయినా బాగుకాలేదు. అప్పుడు అది ఒక జబ్బు అనుకున్నాను. అయితే మా అమ్మ నా దగ్గరకు వచ్చి ఏడ్చి ప్రార్థించవద్దు" అన్నప్పుడు ఆమె అపవిత్రాత్మ కలిగి వున్నట్లుగా అనిపించి అప్పటి నుండి ఆమె కోసం ప్రార్థించసాగాను.

ఒకరోజు మా నాన్న వచ్చి "యేసయ్యను గురించి నేను

కూడా విన్నాను, ఆయన చాలామందిని స్వస్థపరిచాడని. అయితే అది ఒకప్పుడు ఇప్పుడు ఈ కాలంలో కూడా స్వస్థత జరిగితే నమ్మవచ్చు. మీ అమ్మని యేసయ్య ఒక నెలలోపు బాగుచేస్తే మేము కూడా ఆయను నమ్ముతాము. ఒకవేళ అలా బాగుకాని పక్షంలో నువ్వు దేవున్ని వదిలిపెట్టాలి" అని నాతో ఛాలెంజ్ చేశాడు. అందుకు నేను ఒప్పుకున్నాను. అయితే నెల రోజుల తర్వాత మా అమ్మకు స్వస్థత జరగలేదు. ఆఖరి రోజు రాత్రి ఎనిమిది గంటలకు మా నాన్న నాకు ఫోన్ చేసి "చెప్పిన సమయంలోపు మీ అమ్మకి బాగుకాలేదు. కాబట్టి నువ్వు ఇచ్చిన మాట ప్రకారం యేసయ్యని వదిలేయాలి" అన్నాడు. అప్పుడు నేను నా మాటైన తప్పుతాను గాని దేవుణ్ణి వదలను"అన్నాను. అందుకు మానాన్న "మాట మీద నిలబడలేని దానివి నువ్వేం చేస్తావు? దేవుడు నీ ప్రార్థన ఏం వింటాడు? అన్నాడు. కాని నాకు ఇంకా విశ్వాసం వుంది. ఆ రోజు గడవటానికి ఇంకా నాలుగు గంటలు సమయం వుంది కదా! ఈ లోపు దేవుడు స్వస్థపరచకపోతాడా? అనుకున్నాను. అప్పుడు నేను దేవునికి ప్రార్థించాను" యేసయ్య ఈ విషయం అందరికీ తెలుసు, ఇప్పుడు స్వస్థత జరగకపోతే అందరూ దేవుడు ఏమీ చేయలేదనుకుంటారు. కాబట్టి అందరూ ఆశ్చర్యపోయే రీతిలో మా అమ్మకి స్వస్థత దయచేసి అద్భుత కార్యం జరిగించమ"ని ప్రార్థించాను. తరువాత రోజు ఇంటికి ఫోన్‌చేసి అమ్మకి బాగయిందా? అని అడిగితే "బాగు కాలేదు" అని చెప్పారు. నేను చాలా బాధపడ్డాను. నేను చాలా ఏడ్చాను. నా గురించి నేను అడగలేదు. అందరూ తెలుసుకొనేలా అద్భుతకార్యం జరగలేదని చాలా బాధపడ్డాను. అంతేకాక నేను కాలేజిలో మొదటి సంవత్సరంలో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాను. అప్పుడు కూడా మానాన్న "నువ్వు యేసయ్యను నమ్ముకున్నావు కాదా! ఆయన నిన్ను పాస్ చేయించ లేకపోయాడా?" అని దెప్పిపొడుపుగా అన్నాడు. అయినప్పటికి యేసయ్య మీద నాకున్న విశ్వాసం సడలలేదు. దేవుడు అన్నీ నా మంచికే చేసివుంటాడనుకున్నాను.

నేను సెలవులకు మరలా ఇంటికి వెళ్ళాల్సి వచ్చింది. వాళ్ళు నన్ను అడిగినప్పుడు నేను వారికి ఎలా సమాధానం చెప్పాలో సిద్ధడ్డాను. నేను వారితో దేవుని వాక్యం పంచుకో వాలనుకున్నాను. నేను వారిని ఎంతో బ్రతిమాలి వాక్యం చెప్పేదానను. మానాన్న విన్నప్పటికీ "ఇవన్నీ నాకు తెలుసు నేను ఎప్పుడో విన్నాను" అంటుండేవాడు. నేను మరలా కాలేజీకి వచ్చినప్పుడు అక్కడ దేవుని కూటము జరుగుతుందని తెలిసి నేను వెళ్ళాలనుకున్నాను. కానీ హాస్టల్‌కి వెళ్తే త్వరగా వెళ్ళలేనని తెలిసి నేరుగా కూటము దగ్గరకు వెళ్ళాను. అప్పుడు మా నాన్న హాస్టల్‌కి ఫోన్ చేసినప్పుడు నేను హాస్టల్లో లేనని తెలిసి వచ్చి చదువు మాన్పించి ఇంటికి తీసుకువెళ్ళారు. నేను ఆ కాలేజీలో, హాస్టల్లో ఉంటే స్నేహితులతో కలిసి చర్చికి, దేవుని కూటాలకు వెళ్తానని కాలేజి మాన్పించాలని చూశారు. కాని కుదర్లేదు. అందుకని నాకు పెళ్ళి చేయాలని నిర్ణయించు కున్నారు. అది కూడ కుదర్లేదు. వారు నా గురించి ఎంతో డబ్బు ఖర్చుచేసి నన్ను చదివించాలనుకున్నప్పుడు వారి ఎదురుగా ఉండి వాళ్ళను బాధపెట్టడం ఇష్టంలేక నేను చర్చికి వెళ్ళను, కాలేజికి వెళ్ళి చదువుకుంటాను" అని నేను మరలా కాలేజీకి వచ్చాను. చర్చికి వెళ్లకుండా ఉన్నంత మాత్రాన దేవుడు నాకు దూరం కాడు. నా హృదయంలో నుండి ఆయనను ఏ పరిస్థితులూ తీసివేయలేవు అని నిశ్చయించుకున్నాను. తర్వాత నేను అప్పుడప్పుడూ చర్చికి వెళ్తుండేదాన్ని. ప్రతి ఆదివారం ఉదయం 7-30 గంటలకి మా నాన్న ఫోన్ చేసేవాడు. వాళ్ళు ఫోన్ చేసిన తర్వత చర్చికి వెళ్ళేదానను. కానీ మా అమ్మ ఒక విషయం చెప్పడం మర్చిపోయి మళ్ళీ తొమ్మిది గంటలకి ఫోన్ చేసింది. అలా నేను వారికి తెలియకుండా చర్చికి వెళ్తున్నాని తెలిసింది వాళ్ళు మళ్ళీ కాలేజి మాన్పించాలని చూశారు కానీ జరగలేదు. మళ్ళీ నేను సెలవులకు ఇంటికి వెళ్ళినప్పుడు మా నాన్న "ఎందుకు ఇలా చేస్తున్నావు? తల్లిదండ్రులను ఎందుకిలా బాధ పెడుతున్నావు? అది పాపం అని ఏడ్చాడు. అప్పుడు నేను "మన కుటుంబానికి శాంతి యేసయ్యలో మాత్రమే ఉందని నమ్మి ఇదంతా చేస్తున్నాను. మీకు ఈ విషయం ఇప్పుడు అర్థం కాదు. ఒక రోజు తెలుస్తుంది" అని చెప్పాను. మా నాన్న ఎప్పుడు ఏడ్వడం చూడలేదు. కానీ నా విషయం ఏడ్చి 'మమ్మల్ని ఇలా కష్టపెట్టకు' అన్నప్పుడు నేను చాలా గాయపడ్డాను. అప్పుడు నేను వాళ్ళని మళ్ళీ సమాధానపరిచి "నేనలా చెయ్యను, మనమందరం బాగుండా లనే చేశాను" అన్నాను. అప్పుడు మానాన్న "నువ్వు అన్నీ మర్చిపోయి బాగా చదువుకో, మీ అమ్మను నేను బాగుచేయి స్తాను." అన్నాడు. అది మా నాన్న చేయలేడని తెలిసినా "సరే!"అని అన్నాను. ఇప్పుడు నేను ఒక రహస్య క్రైస్తవురాలిగా ఉంటున్నాను. నేను మా చెల్లికి కూడా సువార్త చెప్పాను.

**(మిగితాది 19వ పేజీలో)**

# లోకంతీరు

1

(పుట్టుక చావు మధ్య సంబరం)

## నేను భూమికి పునాదులు వేసినప్పుడు నీవెక్కడ నుంటివి?

మరణద్వారములు నీకు తెరువబడెనా? మరణాంధకార ద్వారములను నీవు చూచితివా? వర్షమునకు తండ్రియున్నాడా? మంచు బిందువులను పుట్టించువాడెవడు? కృత్తిక నక్షత్రము లను నీవు బంధింపగలవా? మృగశీర్షకు కట్లను విప్పగలవా? వాటి వాటి కాలములలో నక్షత్ర రాసులను వచ్చునట్లు చేయగలవా? ఆకాశమండలపు కట్టడలను నీవెరుగుదువా? దానికి భూమి మీదగల ప్రభుత్వమును నీవు స్థాపింపగలవా? జల రాసులు నిన్ను కప్పునట్లు మేఘములకు నీవు ఆజ్ఞ ఇయ్యగలవా? మెరుపులు బయలు వెళ్లి -చిత్తము ఉన్నామని నీతో చెప్పునట్లు నీవు వాటిని బయటికి రప్పింపగలవా? అంతరింద్రియములలో జ్ఞానముంచిన వాడెవడు? హృదయమునకు తెలివినిచ్చిన వాడెవడు? (యోబు 38)

ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండ నేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగానుండి యొకని తృణీకరించును.

## మీరు దేవునికి సిరికిని దాసులుగా నుండనేరరు. (మత్తయి 6:24)

## ధనాపేక్ష సమస్తమైన కీడులకు

## మూలము (1తిమోతి 6:10)

ఒక మనిషి జీవితం ఎంతో విలువైనది. మొదటి ప్రాధాన్యత ఆ మనిషి తనకు ఇచ్చుకున్న తర్వాతే ఇంక మిగతావి. ఇది మనిషి సహజ గుణం. అంటే తను, తన కుటుంబం, తన బంధువులు, స్నేహితులు ఇలా తనకు తనకు సంబంధించిన వారి తర్వాతే ఏదైనా. ఆచరణలో దీన్ని అధిగమించటం చాలా కష్టం. దేవున్ని నమ్మిన వాళ్ళు సైతం దీనికి అతీతులు కారు.

**పుట్టుక**

**దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

దేవుడు ఆదాము, హవ్వలను చేసిన తర్వాత మంచి చెడ్డల తెలివిని ఇచ్చే చెట్టును వేయకపోయి నట్లయితే ఎలా వుండేది? దేవుడు మంచిచెడ్డల తెలివినిచ్చే వేయడంలో దేవుని ఉద్దేశ్యం ఏమై వుంటుంది? దేవుడు మనిషిని ప్రేమిస్తున్నాడు అనటానికి గుర్తు మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టును వేయడం. మనిషికి ఇచ్చిన స్వేచ్ఛకి గుర్తు మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు. దేవుడు మనిషిని ప్రేమిస్తున్నాడు, మనిషి దేవున్ని ప్రేమించాలి. అదే దేవుడు కోరుకొనేది. ఆదాము, హవ్వలకు పరీక్ష మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు. వారు దేవున్ని హృదయ పూర్వకంగా ప్రేమిస్తే ఎలాంటి ప్రలోభాలకి లొంగకుండా దేవుని ఆజ్ఞ పాటించి పండు జోలికి వెళ్ళరు.

“మంచిచెడులు” “తెలివినిచ్చేచెట్టు”. మనిషి తనకు ఏది మంచిదో, ఏది చెడ్డదో తెలుసుకోవాల్సిన అవసరం మనిషికి లేదని దేవుని ఉద్దేశం. మనిషికి ఏమి అవసరమో అవన్నీ దేవుడు సృష్టించాడు. మనిషిని చేసిన తర్వాత దేవుడు ఇంక మనిషి అవసరాల కోసం ఏమి సృష్టించలేదు. మనిషి తినడానికి అనేక రకాలైన పండ్లు ఇచ్చాడు. వాళ్ళు కడుపు నింపుకోడానికి మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు ఫలము తినాల్సిన అవసరం ఏమీ లేదు. కాబట్టి మంచిచెడ్డల

తెలివినిచ్చే చెట్టు మనిషి విశ్వసనీయతకు ఒక పరీక్ష.

ప్రతి మనిషి జీవించడానికి అవసరమైనది మొదట ఆహారము. ముందు కడుపు నిండిన తర్వాతే మిగతా విషయాల గురించి ఆలోచిస్తారు ఎవరైనా. బాగా ఆకలి అవుతుంటే మంచి బట్టలు వేసుకోవాలని కాని, ఖరీదైన ఇల్లు కావాలని కాని కోరుకోరు. కాబట్టి మనిషి మొదటగా ఆహారము విషయంలో నమ్మకముగా వుండాలి. మనిషి ఆహారము వలన మాత్రమే కాక దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలన బ్రతుకును అని నమ్మాలి. ఏలియాని దేవుడు పోషించాల్సి వచ్చినప్పుడు ముందుగా కాకుల ద్వారా ఆహారము పంపించాడు, తర్వాత పేద విధవరాలి ద్వారా పోషింపబడ్డాడు. కాబట్టి దేవుని మీద ఆధారపడిన వారికి దేవుడే పోషకకర్త. మన మంచి చెడ్డలను మనమే చూసుకోకుండా దేవునికి అప్పజెప్పినప్పుడు దేవుడు మన మంచిచెడ్డలను చూస్తాడు. సరే, దేవుడు మనిషికి తెలివితేటలు ఇచ్చాడు కదా! మన మంచిచెడ్డలు మనం చూసుకోసుకుండా అన్నిటికీ దేవుని మీద ఆధారపడాలా అని అనుకోవచ్చు. దేవుడు మనిషికి తెలివితేటలు ఇచ్చింది, తన సృష్టికర్త ఎవరో తెలుసుకొని ఆయన ఆజ్ఞల ప్రకారం నడుచుకోడానికే కాని, దేవుడిచ్చిన తెలివితేటలతో దేవునికి దూరమవమని కాదు.

> **చా వు**
>
> **ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

సరే, ఇప్పుడు జరుగుతుంది ఏంటి? ప్రతి మనిషి తన తెలివితేటలతో తన అవసరాలు తీర్చుకోడానికి అంటే తిండి, బట్ట, ఇల్లు, ఆస్తులు, స్థలాలు, పొలాలు, బంగారం ఇంకా తన అవసరాలకు మించి సంపాదించుకోడానికే తన జీవితం మొత్తం సరిపోతుంది. తనను సృష్టించిన దేవున్ని గురించి పట్టించుకోలేనంత బిజీగా సంపాదించుకోవడం తోనే జీవితకాలం ముగిసిపోతుంది. ఆదాము హవ్వలు అలా దేవుడు వారికిచ్చిన తెలివితేటలు కాకుండా, ఇంకా తెలివితేటలు సంపాదించడానికి, దేవుడు వారికిచ్చిన శాంతి సమాధానాలు కాదని దేవదూతల్లా వెలిగిపోవడానికి, దేవుడు వారికి సరిపోయినంతకంటే ఎక్కువగా తినడానికి ఇచ్చినా, దేవుని ఆజ్ఞని కాదని దేవుడు తినవద్దని చెప్పినది తిన్నారు. అందువల్ల దేవుడు వారికి ఇచ్చిన ఆధికృతలన్నీ కోల్పోయారు. మనిషిని సృజించడానికి ముందే మనిషికి ఏమి అవసరమో అన్నీ సృష్టించాడు. మనిషిని సృజించిన తర్వాత ఇంకేమి సృష్టించలేదు. తను చేసిన పని అంతటి నుండి విశ్రమించాడు. అలాగే ప్రతి మనిషి నిద్రలేవడానికి ముందే మనిషికి అవసరమైవన్నీ దేవుడు సిద్ధం చేసి వుంచుతాడు. అయితే మనిషి అది గ్రహించకుండా తన తెలివితేటలతో సంపాదించుకోవడానికే ప్రాధాన్యతనిస్తాడు. అందుకే దేవుడిచ్చే దానిని కోల్పోతాడు. మనుష్యులకున్న సమస్యలన్నిటిని దేవుడు గోటితో తీసేసేలోపే మనిషి తన తొందరపాటుతో గొడ్డలి ఉపయోగించి తీయటానికి సిద్ధమవుతాడు.

పండు తినక ముందు వారు ఎలాంటి కష్టాలు లేకుండా చీకూ చింతా లేని జీవితం గడిపారు. పంటలు పండించుకోలేదు, బట్టలు వేసుకోవాల్సి అవసరం కూడా లేకుండా, కడుపునిండా తిని హాయిగా తోటలో నిద్రపోయేవారు. అంతేకాక ప్రతి రోజు దేవుడు వారిని పరామర్శించే వాడు. సమాధానకరమైన జీవితం వారు జీవించే వారు. వారి అవసరాలేంటో కూడా వారికి తెలియకుండా నిశ్చింతగా వుండేవారు. పండు తిన్నాక అప్పటి వరకు వారికి వున్న నిశ్చింత పోయింది. ముందుగా వారికి భయం ఆవహించింది. వారి సిగ్గు వారికి తెలిసింది. వారు తాము దిగంబరంగా వున్నా మని తెలిసి సిగ్గుతో, భయంతో చెట్టును ఆశ్రయించారు. దేవుని ఎదుటకు వచ్చే ధైర్యం కోల్పోయారు. నిందలు మోపుకోవడం మొదలు పెట్టారు. దేవుని సన్నిధి నుండి గెంటి వేయబడ్డారు. అబద్దాలు, హత్యలు ఇంకా నానారకాలైన పాపాలు చేయటానికి నాంది పలికింది. ఇదంతా ఎందుకు? దేవుడు వారికిచ్చిన జీవితాన్ని కాదని, ప్రలోభాలకి లొంగి అవసరం లేనిదానికోసం, దేవుడు వారికివ్వని దానికోసం ప్రాకులాడటమే. అది ఆనాటి మానవుని కథ.

**(ఇంకా వుంది)**

## కొడవటికంటిగారి రచనలు

| | | | |
|---|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. | 40 |
| 2. | జప్పత్తస్నేహు | రూ. | 45 |
| 3. | ఆసెనతు | రూ. | 150 |
| 4. | అపొస్తలుడు | రూ. | 60 |
| 5. | బర్నబా | రూ. | 30 |
| 6. | తిమోతి | రూ. | 40 |
| 7. | నా చిత్తానుసారుడు | రూ. | 110 |
| 8. | గుంట నుండి మింటికి | రూ. | 50 |
| 9. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. | 60 |
| 10. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. | 65 |
| 11. | తోటలో పనివాడు | రూ. | 20 |
| 12. | గోత్రకర్త (యాకోబు) | రూ. | 50 |
| 13. | నా కుటుంబము | రూ. | 25 |
| 14. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. | 50 |
| 15. | నా కుమారి (రూతు) | రూ. | 60 |
| 16. | నా స్నేహితుడు | రూ. | 50 |
| 17. | అంత్యదినములలోని యదార్థ ప్రవక్త | రూ. | 50 |
| 18. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. | 65 |
| 19. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. | 65 |
| 20. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. | 65 |
| 21. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. | 65 |
| 22. | సువార్తలలోని యేసుకథ | రూ. | 75 |
| 23. | యేసుకథ రెండవ భాగం | రూ. | 75 |
| 24. | యేసుకథ మూడవ భాగం | రూ. | 75 |
| 25. | జీవనమంతయు | రూ. | 40 |
| 26. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. | 65 |
| 27. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. | 65 |
| 28. | ఓ చినుకునవుతా... | రూ. | 30 |
| 29. | విశ్వాసము విజయము-1 | రూ. | 70 |
| 30. | విశ్వాసము విజయము-2 | రూ. | 70 |
| 31. | విశ్వాసము విజయము-3 | రూ. | 70 |
| 32. | హదస్సా | రూ. | 70 |
| 33. | పరలోకము - నరకము | | |

పుస్తకములు కావలసినవారు :

**రెవ. డా॥ కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

కృపాదానంగారివీధి, క్లోపేట, 6వ లైను,

ఒంగోలు-523001, ప్రకాశం జిల్లా,

ఫోన్ : 9866716506, 9440217726

## సండేస్కూల్ మెటీరియల్

| | | |
|---|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-1 | రూ. | 35/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-2 | రూ. | 35/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-3 | రూ. | 45/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్ | రూ. | 35/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-1 | రూ. | 35/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-2 | రూ. | 45/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-3 | రూ. | 45/- |
| మార్గము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. | 25/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. | 20/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. | 20/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. | 40/- |
| సండేస్కూల్ డైరి | రూ. | 50/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-1 | రూ. | 25/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-2 | రూ. | 35/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. | 40/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. | 35/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. | 10/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. | 160/- |

### సండేస్కూల్ గేమ్స్

| | | |
|---|---|---|
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. | 200/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. | 200/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. | 300/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. | 250/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. | 120/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. | 300/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. | 300/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. | 350/- |
| ఫ్రూట్స్ ఆఫ్ స్పిరిట్ బోర్డ్ గేమ్ | రూ. | 350/- |
| ట్యాబర్‌నికల్ బోర్డ్ గేమ్ | రూ. | 350/- |
| ఈజిప్ట్ టు కానాన్ జర్నీ బోర్డ్ గేమ్ | రూ. | 350/- |

వివరాలకు : **బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**

కృపాదానంగారివీధి, క్లోపేట, 6వ లైను,

ఒంగోలు-523001, ప్రకాశం జిల్లా,

ఫోన్ : 9440217726